ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 04.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 254 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



రెండో వన్డేలో భారత్ ఓటమి 12



‘డిసెంబర్ మూడుకు ఒక ప్రత్యేకత ఉంది. మీ ఓటును ఆయుధంగా మార్చి నాటి దుర్మార్గ పాలనను అంతమొందించి ప్రజా పాలనను తీసుకొచ్చిన రోజు. తెలంగాణ కోసం శ్రీకాంతాచారి అమరుడైన రోజు ఇది’ అని సీఎం రేవంత్ తెలిపారు. శ్రీకాంతాచారి ఆశయ సాధనలో భాగంగా మొదటి యేడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. రెండున్నరేండ్లు పూర్తి చేసుకునే లోగా మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ పాలనలో లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదన్నారు.

30 నెలలలో 40 వేల ఉద్యోగాలు

రెండేండ్లలో 60 వేలు భర్తీ చేశాం

పదేండ్లలో 20 లక్షల ఇండ్లు కట్టిస్తాం

- బహుజన రాజ్యానికి పునాదులు వేసిన గడ్డ
- హుస్నాబాద్ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాం
- గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- ‘కాళేశ్వరం’ కడితే కూలేశ్వరం అయ్యింది
- గత పాలకుల లాగా మేం నిర్లక్ష్యం చేయబోం
- ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది
- పని చేసేవారినే సర్పంచులుగా ఎన్నుకోండి
- హుస్నాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- రూ.262.68 కోట్ల విలువైన పనులకు శ్రీకారం

ప్రతిపక్షం ప్రత్యేక ప్రతినిధులు

సిద్ధిపేట, కరీంనగర్, హైదరాబాద్, డిసెంబర్ 3: రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ మీద సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని, త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం పర్యటించారు. రూ.262.68 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తు చేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వివరించారు. 50 లక్షల కుటుంబాలకు

...:: మిగతా 2లో

ఆరోగ్య తెలంగాణ దిశగా

తెలంగాణ రాష్ట్ర పయనం

భారీగా వైద్యులు, సిబ్బంది నియామకం



- వైద్య, నర్సింగ్ కళాశాలలు, సీట్ల సంఖ్య పెంపు
- 2 వేల పడకలతో ‘ఉస్మానియా’కు కొత్త భవనం
- ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్య కూడా పెంపు
- మారుమూల ప్రాంతాలకూ వైద్య సేవల విస్తరణ
- గర్భిణుల నుంచి వృద్ధుల దాకా అత్యుత్తమ సేవలు
- వైద్య రంగం మీద సీఎం, ఆరోగ్య మంత్రి ప్రత్యేక దృష్టి
- రెండేళ్ల ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రస్థానం ఇది

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 3 : ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం వైద్యారోగ్య శాఖపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వాసుపత్రుల సేవల బలోపేతం దిశగా పలు కార్యక్రమాలు చేపట్టారు. వాటి ఫలితాలు నేడు కళ్లకు కనిపిస్తున్నాయి. ప్రసవాలకు ఏజెన్సీ ప్రాంత గర్భిణులు ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. గర్భిణులకు అందే వైద్యం నుంచి వృద్ధులకు వచ్చే సమస్యల వరకు ప్రతి రుగ్మతకు ప్రభుత్వాసుపత్రులలోనే సేవలు అందాలని ముఖ్యమంత్రి పలుమార్లు నొక్కిచెప్పారు. ఈ క్రమంలోనే వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నియామకం, ఆసుపత్రుల నిర్మాణం, వైద్య, నర్సింగ్ కళాశాలల సంఖ్యను పెంచడంతో పాటు సీట్లను పెంచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ప్రత్యేక శ్రద్ధతో జూనియర్ డాకర్ల స్టైఫండ్ పెంపు మొదలు ప్రతి సమస్యను పరిష్కరించడంతో పాటు వైద్యారోగ్య రంగాన్ని బలోపేతానికి కృషి చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచారు.1,375 చికిత్సల ధరలను సుమారు 22 నుంచి 25 శాతం వరకూ పెంచి, కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చారు. ఫలితంగా ఆరోగ్య శ్రీ కింద అందే చికిత్సల సంఖ్య 1,835కి పెరగడంతో లక్షలాది మందికి ప్రయోజనం కలిగింది. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ హాస్పిటళ్ల సంఖ్యను క్రమంగా పెంచుకుంటూ

...:: మిగతా 2లో



మోడీ సర్కారు బహుజనులకు ద్రోహం చేస్తోంది

కేంద్ర ప్రభుత్వం దేశంలోని బహుజనులకు బహిరంగంగానే ద్రోహం చేస్తున్నదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక, కాలపరిమితి, పార్లమెంట్‌లో చర్చ, ప్రజల అభిప్రాయం లేకుండానే కులగణన సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారని విమర్శించారు.

11

Sanchar Saathi

సంచార్ సాథీపై వెనక్కి తగ్గిన కేంద్రం

అన్ని మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ని తప్పనిసరిగా ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలంటూ మొబైల్ ఫోన్ తయారీ కంపెనీలకు జారీచేసిన ఆదేశాలపై కేంద్రం వెనక్కు తగ్గింది. ప్రీ ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి కాదని స్పష్టం చేసింది.

11



లీకు వీరులపై విజిలెన్స్ నిఘా!

- విచారణ పూర్తి, చర్యలు షురూ
- ‘హిల్ట్’ పాలసీ లీక్‌పై సర్కారు సీరియస్
- జీఓ రాకముందే సమాచారం బయటకు
- వేగంగా స్పందించిన సీఎంఓ, సీఎస్ఓ
- సీఎం టేబుల్ మీద విచారణ నివేదిక
- నేడో రేపో బాధ్యులపై కఠిన చర్యలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 3 : ఔటర్ లోపల పరిశ్రమల భూములను మల్టీయూస్ జోన్లుగా మార్చే ‘హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ’ (హిల్టిప్)’పై తీసుకున్న నిర్ణయం ముందే బయటకు లీక్

...:: మిగతా 2లో

గ్లోబల్ సమ్మిట్‌కు రండి

ప్రధాని మోడీకి సీఎం రేవంత్ ఆహ్వానం

- సోనియా, రాహుల్, ప్రియాంకకు కూడా
- సమ్మిట్‌పాలసీలను సమగ్రంగా సిద్ధం చేశాం
- సదస్సులో వాటిని ఆవిష్కరించబోతున్నాం
- అభివృద్ధికి సంపూర్ణంగా సహకరించండి
- మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్ పనులకు అనుమతివ్వండి
- ప్రధాని నరేంద్ర మోడీకి సీఎం రేవంత్ రెడ్డి వినతి



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 3 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నాడు ఢిల్లీలో పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ నెల 8,9 న హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించే ‘తెలంగాణ రైజింగ్ 2047 సమ్మిట్’ కు రావాలంటూ ప్రధానమంత్రిని ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీని వారి నివాసంలో కలిసిన ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ పాలసీతో పాటు రాష్ట్రం రన్ని రంగాలలో అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు తదితర విషయాల గురించి వారికి వివరించారు. ప్రధానమంత్రి

...:: మిగతా 2లో



ఎంసీడీ ఎన్నికలలో బీజేపీ హవా

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బీజేపీ హవా నడిచింది. తాజాగా 12 డివిజన్లకు జరిగిన ఉప ఎన్నికలలో 7 స్థానాలను కైవసం చేసుకుంది. మిగతా ఐదు స్థానాలలో మూడింటిని ఆమ్ ఆద్మీ పార్టీ, ఒకటి కాంగ్రెస్ గెలుచుకున్నాయి.

11

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



- 12 మంది మావోయిస్టులు మృతి
- ముగ్గురు డీఆర్ జవాన్లు కూడా
- గంగాలూరు అడవులలో ఎదురు కాల్పులు
- భారీగా ఆయుధాలు స్వాధీనం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

బీజాపూర్, డిసెంబర్ 3 : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు -మావోయిస్టుల మధ్య జరిగిన ఈ కాల్పులలో 12 మంది మావోయిస్టులు చనిపోయారు. ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డులు కూడా చనిపోయారు. గాలింపు కొనసాగుతోందని భద్రతా బలగాలు తెలిపాయి. బస్తర్ డివిజన్‌లోని దంతెవాడను ఆనుకుని ఉన్న గంగాలూరు

...:: మిగతా 2లో



జర్నలిస్టుల సమస్యలు

వెంటనే పరిష్కరించాలి

- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తప్పదు
- జర్నలిస్టుల మహా ధర్నాలో వక్తల డిమాండ్
- మహా ధర్నాకు భారీగా తరలివచ్చిన పాత్రికేయులు
- నినాదాలతో దద్దరిల్లిన మహానగర రహదారులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 3 : పన్నెండేండ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న రాష్ట్ర జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలనే డిమాండ్ తో మాసాబ్ ట్యాంక్ లోని సమాచార కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే)ఆధ్వర్యంలో బుధవారం నాడు జరిగిన మహా ధర్నా అనూహ్యరీతిలో విజయవంతం అయ్యింది. టీయూడబ్ల్యూజే పిలుపునకు స్పందించి, రాజధాని హైదరాబాద్ తో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ఎంతో ఉత్సాహంగా, భారీగా జర్నలిస్టులు తరలి రావడం విశేషం. జర్నలిస్టుల నినాదాలతో మహానగరం రోడ్లన్నీ దద్దరిల్లాయి. సమాచార శాఖ చరిత్రలో, ఆ కార్యాలయం వద్ద ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ధర్నా చేయడం ప్రప్రథమని పోలీసు

...:: మిగతా 2లో

డాక్యుమెంట్లు పరిశీలించాకే విచారణ

- డివిజన్ బెంచ్ ముందుకు ‘పంచాయతీ’
- పూర్తి స్థాయి దస్త్రాలను సమర్పించండి
- ప్రభుత్వానికి సీజే ధర్మాసనం ఆదేశం
- సవరణకు ఆదేశాలిస్తే తీవ్ర పరిస్థితులు
- కోర్టుకు విన్నవించిన ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 3 : పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ కు సంబంధించి దాఖలైన పిటిషన్లపై పూర్తి స్థాయి దస్త్రాలను సమర్పించాలని హైకోర్టు సీజే ధర్మాసనం పిటిషనర్ల న్యాయవాదులను ఆదేశించింది. ఆ తర్వాతే విచారణ చేపడతామని పేర్కొంది. 2011జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్పంచ్‌పదవులలో రిజర్వేషన్కేటాయించడాన్ని సవాలు చేస్తూ మొత్తం ఆరు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై మంగళవారం నాడు జస్టిస్ జస్టిస్ టి. మాధవీదేవి విచారణ చేపట్టారు. అనంతరం ఈ పిటిషన్లను డివిజన్ బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువ ఉన్నచోట, లేని చోట కూడా రిజర్వేషన్ కేటాయించారని, మరికొన్ని చోట్ల పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా లేనప్పటికీ కేటాయించారని న్యాయవాది పేర్కొన్నారు. వాటిని సవరించి తాజా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కేటాయించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ ఎస్టీ, ఎస్సీలకు రిజర్వేషన్‌కల్పించిందన్నారు. పిటిషన్‌దారులు కోరినట్లు పంచాయతీలను ఇతరులకు రిజర్వు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేస్తే అవి రోస్టర్ ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో పాటు విస్తృత పరిణామాలకు దారి తీస్తుందని చెప్పారు. అందువల్ల పంచాయతీల ఎన్నికలపై డివిజన్ బెంచ్ తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. దీంతో పిటిషన్లను డివిజన్ బెంచ్ ముందుంచాలంటూ జస్టిస్ రిజిస్ట్రీని ఆదేశించారు. వాటిని పరిశీలించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ పూర్తి స్థాయి డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే విచారిస్తామని తెలిపారు. ఈ మేరకు డాక్యుమెంట్లు అందించాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసారు.



2026లో బంగారం ధర ఎంత ఉంటుంది?!

ప్రస్తుతం భారతీయ ఇన్వెస్టర్లు, సామాన్య ప్రజలు గూగుల్ లో భారీగా సెర్చ్ చేస్తున్నది ఏంటో తెలుసా! వచ్చే యేడాది 2026లో బంగారం ధరలు ఎలా ఉంటాయా అని!!

11

నా మాటలను వక్రీకరించారు

- బీజేపీ నేతలపై సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 3 : ఉత్తర భారతదేశంలో బీజేపీ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను ఆయన బుధవారం కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం తన నేతృత్వంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హిందూ సమాజం వంటిదే అని తాను పేర్కొన్నానని అన్నారు. పార్టీ నేతగా ఎలా పని చేయాలనే అంశాన్ని వివరిస్తున్న క్రమంలో తాను చేసిన వ్యాఖ్యలపై విమర్శలు చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బీజేపీ డిపాజిట్ కోల్పోయిందని, ఆ ఆవేదనతోనే తన వ్యాఖ్యలను వివాదాస్పదం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన అంశాలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారన్నారు. హిందూ మతంలో కోట్లాది మంది దేవతలున్నారని, పెండ్లికానివారికి హనుమంతుడు, రెండు పెళ్లిళ్లు చేసుకునేవారికి మరొక దేవుడు, మద్యపానం చేసేవారికి ఇంకొక దేవుడు ఉన్నారని, అదేవిధంగా మల్లమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ వంటి దేవతలు కూడా ఉన్నారని డీసీసీ అధ్యక్షుల సమావేశంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కల్లు పోసి, కోడిని బలిచ్చే వారికి ఒక దేవుడు, పప్పన్నం తినేవారికి సైతం ఒక దేవుడు ఉన్నారని, మనకు అన్ని రకాల దేవుళ్లు ఉన్నారని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





గ్లోబల్ సమ్మిట్ కు హాజరుకండి

- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ ఆహ్వానం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్3: హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు హాజరుకావాలని కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. పార్లమెంటులో కేంద్ర మంత్రిని సీఎం కలిశారు. ఈ సందర్భంగా సమ్మిట్లో ఆవిష్కరించనున్న విజన్ డాక్యుమెంట్ గురించి కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. అనంతరం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ , కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.



రాహుల్, ప్రియాంకతో సీఎం రేవంత్ భేటీ

- గ్లోబల్ సమ్మిట్ కు రావాలని ఆహ్వానం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 3: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకాగాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నాడు ఢిల్లీలో భేటీ అయ్యారు. హైదరాబాద్ లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు రావాలని ప్రత్యేకంగా వారిని ఆహ్వానించారు. భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించి ఆహ్వాన పత్రికను అందించారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీలు, ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ఉన్నారు.

30 నెలలలో 40 వేల ఉద్యోగాలు

మొదటిపేజీ తరువాయి

200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని, మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేండ్లు నిధులెందుకు ఇవ్వలేదు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని అన్నారు. గత పదేండ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలస్వతం ప్రదర్శించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర సాధనలో కరీంనగర్ ప్రజల కీలక పాత్ర

అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని కరీంనగర్ వేదికగా సోనియమ్మ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారుని సీఎం తెలిపారు. 60 యేండ్ల కల నెరవేర్చిన సోనియమ్మను కలిసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానం అందించి ఇక్కడికివచ్చానని తెలిపారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, ప్రధాని మోడీని కలిసి గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించామని తెలిపారు. 'డిసెంబర్ మూడుకు ఒక ప్రత్యేకత ఉంది. మీ ఓటును ఆయుధంగా మార్చి నాటి దుర్మార్గ పాలనను అంతమొందించి ప్రజా పాలనను తీసుకొచ్చిన రోజు. తెలంగాణ కోసం శ్రీకాంతాచారి అమరుడైన రోజు ఇది' అని సీఎం తెలిపారు. శ్రీకాంతాచారి ఆశయ సాధనలో భాగంగా మొదటి యేడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. రెండున్నరేండ్లు పూర్తి చేసుకునే లోగా మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ పాలనలో లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి యేడాదిలోనే రైతులకు రూ. రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి రుణ విముక్తులను చేశామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 1 లక్ష 4 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేశామని తెలిపారు. రూ. 8 వేల కోట్లు ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం ఖర్చు చేశామని వివరించారు. ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామన్నారు. లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందించామన్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, దాదాపు 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామంటూ సంక్షేమ పథకాలను వివరించారు.

గండిపల్లి, గౌరెల్లి ప్రాజెక్టులు పూర్తి చేయలే

పదేండ్లు అధికారంలో ఉన్నవాళ్లు హుస్నాబాద్ కు సాగునీరు అందించే గండిపెల్లి, గౌరెల్లి ప్రాజక్టులను పూర్తి చేయలేదని సీఎం ఆరోపించారు. గత పాలకులు వారి ప్రచారం మొదలు పెట్టేందుకు సెంటిమెంట్ గా హుస్నాబాద్ ను ఉపయోగించుకున్నారంటూ ధ్వజమెత్తారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను అభివృద్ధి చేసుకున్నారు కానీ, హుస్నాబాద్ ను అభివృద్ధి చేయలేదన్నారు. గత పాలకుల వలె తాము హుస్నాబాద్ ను నిర్లక్ష్యం చేయబోమని ప్రకటించారు. ఎన్ని నిధులైనా ఖర్చు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

పనిచేసే వారిని గెలిపించండి

'రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. అవి మన గ్రామాలలో వెలుగులు నింపే ఎన్నికలు. సర్పంచ్ ఎన్నికలలో మంచివాళ్లని ఎన్నుకోండని' సీఎం కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసి అభివృద్ధి గ్రామాలను అభివృద్ధి చేసే వాళ్లను సర్పంచులుగా ఎన్నుకోవాలని దీంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రేవంత్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, మేడిపల్లి సత్యం, విజయరమణారావు, సంజయ్, నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, ఠాకూర్, రాజ్యసభ మాజీ ఎంపీ. వి.హనుమంతరావు, సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు తూముకుంట ఆంక్షారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



భారీ ప్రైజ్‌మనీతో హైదరాబాద్‌లో 'ఏకాగ్రా ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్'

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్3: తెలంగాణలో మొట్టమొదటిసారిగా రూ. 22,22,222 నగదు బహుమతులతో కూడిన అతిపెద్ద ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌ను ఏకాగ్రా చెస్ అకాడమీ నిర్వహిస్తోంది. డిసెంబర్ 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ రెండు రోజుల టోర్నమెంట్ జరగనుంది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏకాగ్రా ఇంటర్‌నేషనల్ చెస్ టోర్నమెంట్ వైస్ ఛైర్మన్, ప్రముఖ పాత్రికేయుడు, నంది అవార్డు గ్రహీత షరీఫ్ మహ్మద్ మాట్లాడుతూ – "తెలంగాణలో ఇంత పెద్ద ఓపెన్ రాపిడ్ టోర్నమెంట్ ఇదే తొలిసారి. మొత్తం రూ. 22,22,222 నగదు బహుమతులను విజేతలకు పంచుతాం" అని ప్రకటించారు. సాధారణ ఆటగాళ్లకు ఎంట్రీ ఫీజు : రూ. 5,000 ఉంటుంది. గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు, మహిళలకు – ఉచిత ఎంట్రీ ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ డిసెంబర్ 15 వరకు ఉండగా, ఆలస్య రుసుము రూ. 6,000తో - డిసెంబర్ 18 వరకు గడువు ఉంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో www.ekagrachessacademy.com లో చేసుకోవచ్చని, 79813 58105, 62646 46422, 78428 43999 నంబర్‌లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ డైరెక్టర్ గిరీష్ రెడ్డి మాట్లాడుతూ – "2020లో ఏకాగ్రా చెస్ అకాడమీ ప్రారంభించినప్పటి నుంచి వేలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చాం. 2022లో నిర్వహించిన మా ఫిడే రేటెడ్ టోర్నమెంట్‌లో 1,300కు పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈసారి మరింత ఘనంగా నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. ఆర్గనైజయింగ్ కార్యదర్శి సౌమ్య జానూ మాట్లాడుతూ చెస్ ఆడటం ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తి బాగా పెరుగుతాయి" అని పేర్కొన్నారు.



లీకు వీరులపై విజిలెన్స్ నిఘా!

మొదటిపేజీ తరువాయి

అవడాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుందది. జీఓ 27 విడుదలకు ముందే విపక్షాలకు సమాచారం అందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. అంతర్గతంగా ఏమి జరిగిందో తేల్చేందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమల శాఖలో పాలసీ తయారీ దశలోనే లీక్ జరగడంపై ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. హిల్ట్ పాలసీకి సంబంధించిన ఫొటోషాప్ స్లైడ్స్ బయటకు లీక్ అయినట్టు గుర్తించారు. ఇవి పాలసీ డ్రాఫ్ట్ లేదా క్యాబినెట్ నోట్‌ల నుంచి తీసుకున్నవిగా తెలుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించి, హిల్ట్ పాలసీని రూ. ఐదు లక్షల కోట్ల భూమి మోసంగా ఆరోపించారు. అప్పటికి ప్రభుత్వం జీఓ జారీ చేయలేదు. జీఓ విడుదలకు ముందే పాలసీ వివరాలు బయటపడ్డాయి. కేటీఆర్ ఈ లీక్ సమాచారంతోనే ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వంపై దాడి చేశారు. తర్వాత ప్రభుత్వం జీఓ27 విడుదల చేసింది. ఈ ఆర్డర్‌లో ఔటర్ రింగ్ రోడ్ (లోపల 22 పరిశ్రమల పార్కులలోని 9,292 ఎకరాల భూములను కమర్షియల్, రెసిడెన్షియల్ ఉపయోగాలకు మార్చే వివరాలు ఉన్నాయి. దీని ప్రకారం, పాలసీ తయారీ దశలో సమాచారం లీక్ అయినట్టు స్పష్టమవుతోంది.

కోవర్టులను గుర్తించేందుకు

ప్రభుత్వం ఈ లీక్‌ను తీవ్రంగా తీసుకుంది. ఆ వెనువెంటనే కోవర్టులను గుర్తించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం, చీఫ్ సెక్రటరీ ఆఫీస్ చర్యలు తీసుకున్నాయి. పరిశ్రమల శాఖలో పాలసీ తయారీ సమయంలో లీక్ చేసిన వారిని తేల్చేందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో మిడ్‌లెవల్ అధికారులు, మంత్రుల ఆఫీసుల సిబ్బంది, సీనియర్ అధికారుల చాంబర్లు అన్నింటిపై నిఘా పెట్టి విచారణ జరిపారు. ప్రభుత్వానికి సంబంధించిన అత్యంత కీలక సమాచారం ఇలా బయటకు వెళ్లడాన్ని తేలికగా తీసుకుంటే ఇక ప్రతి నిర్ణయమూ అలా చేరిపోతుందని ప్రభుత్వం భావించింది. విచారణ పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. మంగళవారం సీఎస్ రామకృష్ణారావు కు విజిలెన్స్ రిపోర్ట్ అందడంతో చర్యలు తీసుకోనున్నారు. లీక్‌కు కారణం ఎవరు? అసలు ఏం జరిగింది అనే దానిపై విజిలెన్స్ పూర్తి రిపోర్టు అందించింది. ప్రభుత్వ పెద్దలు ఇలా ఎంత కాలం నుంచి సమాచారాన్ని విపక్షాలకు పంపిస్తున్నారు! ఇతర శాఖలలో ఎంత మంది ఉన్నారో ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం నివేదిక సీఎం టేబుల్ పై ఉన్నట్లుగా తెలుస్తోంది.

ఆరోగ్య తెలంగాణ దిశగా

మొదటిపేజీ తరువాయి

పోతున్నారు. దీంతో ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాలలోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

వైద్యులు, సిబ్బంది పెంపు

ప్రభుత్వాసుపత్రులున్నా వైద్యులు లేక గతంలో అవి అలంకారప్రాయంగా ఉండేవి. ఆ స్థితిని మర్చి ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్టులు, వైద్య కళాశాలలలో ప్రొఫెసర్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ల నియామకాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టారు. మొత్తంగా రెండేండ్ల కాలంలోనే వైద్యారోగ్య శాఖలో తొమ్మిది వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేశారు. మరో ఏడు వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో కొత్తగా తొమ్మిది ప్రభుత్వ వైద్య కళాశాలలను అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున 450 ఎంబీబీఎస్ సీట్లు రాష్ట్ర విద్యార్థులకు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మొత్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 3,690 నుంచి 4,140కి పెరిగింది. అటు, ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థుల సౌకర్యార్థం కొత్త హాస్టల్ బిల్డింగ్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటి నిర్మాణానికి రూ.204.85 కోట్లను కేటాయించింది. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని 15 శాతం దాకా పెంచింది. దేశంలోనే అత్యధిక స్టైఫండ్స్ ఇస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ తొలి అయిదు స్థానాలలో ఉంది. 16 నర్సింగ్ కాలేజీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో నర్సింగ్ కాలేజీలో 60 సీట్లు చొప్పున అదనంగా 960 సీట్లు తెలంగాణ బిడ్డలకు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలో నర్సింగ్ కాలేజీల సంఖ్య 21 నుంచి 37కు పెరిగింది. సీట్ల సంఖ్య 1,400 నుంచి 2,360కి పెరిగింది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ప్రాంత అడవులలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని బస్తర్ రేంజ్ డీఐజీ సుందర్‌రాజ్ పాటలింగం తెలిపారు. ఈ సమయంలో ఎదురు కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం, ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలంలో భారీగా ఆయుధాలు లభించాయి. అయితే, మావోయిస్టులు ఈ ప్రాంతంలో ఆయుధాలు దాచిపెట్టారని పోలీసులు అనుమానిస్తున్నారు. 31 మార్చి 2026 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని హోమ్ మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో భద్రతా దళాల ఆపరేషన్ విస్తృతంగా కొనసాగుతోంది.

గ్లోబల్ సమ్మిట్ కు రండి

మొదటిపేజీ తరువాయి

నరేంద్రమోడీతో సమావేశం అయ్యారు. కీలక అంశాలపైన చర్చించారు. పార్లమెంటులో ప్రధానితో జరిగిన ఈ భేటీలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు ఉన్నారు. కేంద్రం ఎంచుకున్న 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలకు అనుగుణంగా త్రీ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతోందని ప్రధానికి వివరించారు. దీనికి అనుగుణంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని చెప్పారు. నీతి అయోగ్ సలహాలు, సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేధో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్ లో ఆవిష్కరిస్తున్నామని తెలిపారు.

తగిన సహాయం అందించాలి

తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందించాలని సీఎం ప్రధానికి విజ్ఞప్తి చేశారు. మెట్రో రైలు రెండో దశ విస్తరణకు తగిన అనుమతులు ఇవ్వాలని కోరారు. దాదాపు 162.5 కిలోమీటర్ల పొడవునా విస్తరించే ప్రతిపాదనలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందజేసింది. రూ.43,848 వేల కోట్ల అంచనా వ్యయమయ్యే ఈ ప్రాజెక్టును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి కేబినేట్ ఆమోదంతో పాటు ఫైనాన్సియల్ అప్రూవల్ ఇవ్వాలని, దక్షిణ భాగం నిర్మాణానికి కూడా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టును వీలైనంత తొందరగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ నుంచి బెంగుళూరు హై స్పీడ్ కారిడార్ అభివృద్ధి చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేలా కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిరంతరాయంగా రవాణా సదుపాయం ఉండేలా టైగర్ రిజర్వ్ మీదుగా మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఫోర్ లేన్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదించాలని సీఎం ప్రధానికి వినతిపత్రం అందించారు.



పటిష్టంగా గ్లోబల్ సమ్మిట్ బందోబస్తు

- ఏర్పాట్లను పరిశీలించిన ఏడీజీ మహేష్ భగవత్

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్త్ మీద వివిధ శాఖల అధికారులతో అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ బుధవారం ఫ్యూచర్ సిటీలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు, ఐజీపీ రమేష్ రెడ్డి తో కలిసి గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి మొత్తం మీటింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మహేష్ భగవత్ మాట్లాడుతూ.. బందోబస్త్ విషయంలో ఏ మాత్రం పొరపాటు చేయవద్దని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్స్తో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల ప్రతినిధులు, బహుళ సంస్థల అధినేతలు, దేశీయ సంస్థల ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాలతో కలిపి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు.



వరి సేకరణలో తెలంగాణ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు 41.6 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం. 48 గంటలలో ₹7,887 కోట్లు చెల్లించాం. 8,401 పీపీసీలలో 7.5 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది. సన్న రకాలకు రూ314 కోట్లు బోనస్ చెల్లించాం. అటు ఏపీలో ఇప్పటివరకు 11.2 లక్షల టన్నులు సేకరించారు. 1.7లక్షల మందికి రూ.2,830 కోట్లు చెల్లించారు.

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రీయం





హుస్నాబాద్ అభివృద్ధికి భారీ అడుగులు

- రూ. 262.78 కోట్ల పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 3: హుస్నాబాద్ ప్రాంతంలో మొత్తం రూ. 262.78 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన హుస్నాబాద్ అభివృద్ధి దిశలో ప్రభుత్వం వేస్తున్న అడుగుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా, రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి రావడానికి ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. అలాగే, రూ. 45.15 కోట్లతో ఏటీసీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం ద్వారా రవాణా, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయనున్నారు. హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో రూ. 20 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు పునాది వేసిన సీఎం, పట్టణంలో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అదేవిధంగా, రూ. 8.60 కోట్లతో ఏర్పాటు కానున్న ఆర్ టి ఏ యూనిట్ ఆఫీస్‌కి కూడా శంకుస్థాపన చేశారు. రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్-కొత్తపల్లి ప్యాకేజీ-1 లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మరో రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్-అక్కన్నపేట 4 లైన్ల రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారులు ప్రాంతీయ రవాణా సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరిచే అవకాశం ఉంది. ఈ మొత్తం కార్యక్రమాలు హుస్నాబాద్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే కాక, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

మంత్రి పొన్నం కొత్త ప్రతిపాదనలు

హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రతిపాదనలలో హుస్నాబాద్ మున్సిపాలిటీకి 24 గంటల తాగునీటి సరఫరా పథకం అమలు కోసం 60 కోట్ల రూపాయల వ్యయం, సముచిత డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణానికి 80 కోట్ల రూపాయల నిధులు, పట్టణ చుట్టూ రింగ్ రోడ్ నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, మహిళా స్వయం సహాయక సంఘాల కోసం డైరీ పశువుల సరఫరా, గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టు మిగిలిన పనుల పూర్తి కోసం నిధుల విడుదల వంటి అంశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రతిపాదనలను సానుకూలంగా స్వీకరించి హుస్నాబాద్ అభివృద్ధి ప్రభుత్వంలో మరింత వేగంగా జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.



జర్నలిస్టుల సమస్యలు
వెంటనే పరిష్కరించాలి

మొదటిపేజీ తరువాయి

అధికారులతో సహా పలువురు సీనియర్ పాత్రికేయులు చర్చించుకోవడం విశేషం. మహా ధర్నాకు యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్యతో పాటు హైదరాబాద్ ప్రెస్ క్లబ్, జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, టీజేఏ సంపూర్ణ మద్దతును ప్రకటించి మహా ధర్నాలో భాగస్వామ్యమయ్యాయి.

వివిధ సంఘాల సంఘీభావం

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నాలో, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎంఏ మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, నగునూరి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూతురు రాజిరెడ్డి, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్ రెడ్డి, రమేశ్, ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కేఎన్. హరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీశ్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు వి. యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి, మధు గౌడ్, ఫైసల్, హెచ్. యూజే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు రాజేష్, వయోధిక జర్నలిస్టుల సంక్షేమ సంఘం కూడా భాగస్వామ్యం అయ్యింది. ఆ సంఘం నాయకుడు శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఉర్దూ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు మాట్లాడారు.



మేము తెలంగాణ, ఆంధ్ర బాగుండాలనుకున్నాం

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యలు అసమంజసం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 3 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పవన్ కళ్యాణ్ నటుడి హోదాలో ఉన్నప్పటి నుండి తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ నటుడిగా ఉన్నప్పుడు ఏమి మాట్లాడినా చెల్లిందని, కానీ ఇప్పుడు డిప్యూటీ సీఎం హోదాలో ఉండి మాట్లాడితే కుదరదని కవిత స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల గురించి ఆలోచించి మాట్లాడాలని, కోనసీమ పాడవడానికి తెలంగాణ నాయకులే కారణమన్న ఆయన వ్యాఖ్యలు అసమంజసంగా ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ దిష్టి పెట్టలేదని, కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలని కోరుకున్నామని తెలిపారు. తెలంగాణ బిడ్డల మనసు గొప్పదని, తాము ఎప్పుడూ జై తెలంగాణ, జై ఆంధ్రా అని అనలేదని, ఆంధ్ర కూడా బాగుండాలని కోరుకున్నామని పేర్కొన్నారు.

హుస్నాబాద్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 3: హుస్నాబాద్ గ్రామీణ ప్రాంతంలో విద్యా వ్యాప్తిని పెంపొందించేందుకు మరిన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎంను కోరారు. హుస్నాబాద్ లో జరిగిన ప్రజా పాలన విజయోత్సవ సభలో మంత్రి పొన్నం మాట్లాడారు. గ్రామీణ విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి కొత్త భవనాలు, శౌచాలయాలు, ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు అత్యవసరమని అన్నారు. ఈ ప్రాంతంలో పాడి పశుసంపద అధికంగా ఉండటంతో, రైతులు వ్యవసాయం, పాల ఉత్పత్తులపైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. వారి కోసం పశువైద్య శిబిరాలు, శ్రేయోభిలాషి పథకాలు, పాలు సేకరణ కేంద్రాల విస్తరణలో ప్రభుత్వం ఇంకా చేయూత అందించాలనీ రైతులు కోరుతున్నారు. హుస్నాబాద్ పట్టణం నాలుగు జిల్లాల మధ్య కేంద్ర స్థానంలో ఉండటంతో, రవాణా సౌకర్యాల అభివృద్ధి కోసం రింగ్ రోడ్ ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు.



గ్లోబల్ సమ్మిట్ ప్రపంచ దేశాలకి వన్నె తెస్తుంది
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గ్లోబల్ సమ్మిట్ దేశానికి కాదు ప్రపంచ దేశాలకి వన్నె తెస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత 10 సంవత్సరాలుగా విధ్వంస పాలన జరిగిందనీ, అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా ముఖ్యమంత్రికి చేదోడు వధోడు లా ఉండాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఎన్నికల తరువాత ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, ఉత్తర తెలంగాణ కి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లక్ష కోట్లు వ్యవసాయానికి ఖర్చు చేశారనీ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం
మంత్రి వివేక్ వెంకట్ స్వామి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం అవుతుందని మంత్రి వివేక్ వెంకట్ స్వామి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ కి రావడం శుభపరిణామం అన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బంది ఉన్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తుందని అన్నారు. 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేసిందని సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారనీ ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టని బీఆర్ఎస్
మంత్రి శ్రీధర్ బాబు

గత 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో మార్పు కోసం రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేసిన పాదయాత్రలు, పోరాటాలు ప్రజలను ప్రేరేపించాయని చెప్పారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ, శాతవాహన యూనివర్సిటీ ఏర్పాటు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. హుస్నాబాద్‌కు శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ, ఏటీసీ, భారీ అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందించారు.

విద్యార్థులకు ఓ పూట
మంచి భోజనం పెట్టలేరా!

- ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 3 : సీఎం రేవంత్ తీరు 'మింగడానికి మెతుకు లేదు కానీ, మీసాలకు సంపంగి నూనె' అన్నట్టుగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి 1000 కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి, కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ బడులలో మధ్యాహ్న భోజనంలో గొడ్డు కారం, గురుకులాలలో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీలలో పాడైపోయిన భోజనం ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని నిలదీశారు. అడుగడుగునా యూనివర్సిటీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండని హరీశ్‌రావు హితవుపలికారు. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని, విద్యార్థులకు కడుపు నిండా మంచి భోజనం పెట్టాలని సూచించారు.

వర్షిత వర్ష ఆత్మహత్య ఘటనపై సుమోటో కేసు

- కాలేజీకి రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 3 : బాచుపల్లి శ్రీ చైతన్య కాలేజ్‌లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని వర్షిత వర్ష ఆత్మహత్య ఘటనపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో కమిషన్, విద్యార్థుల సంక్షేమం, మానసిక ఒత్తిడి, పర్యవేక్షణ వ్యవస్థ, భద్రతా చర్యలు వంటి అంశాలలో నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు వివిధ స్థాయిలలో అందిన ఫిర్యాదులు, గతంలో కమిషన్ ఛైర్‌పర్సన్ నిర్వహించిన తనిఖీల తరువాత కూడా పరిస్థితులు మెరుగుపడలేదని గమనించింది. ఈ నేపథ్యంలో శ్రీ చైతన్య కళాశాలల ఛైర్‌పర్సన్‌ని ఈ నెల పదిన వ్యక్తిగతంగా హాజరు కావాలని కమిషన్ నోటీసులు జారీ చేసింది. వర్షిత ఆత్మహత్య ఘటనకు సంబంధించిన పరిస్థితులు, కాలేజీ తీసుకున్న చర్యలు, గత తనిఖీల తర్వాత కూడా కొనసాగుతున్న సమస్యలు, కమిషన్ సూచనల అమలు స్థితి, విద్యార్థుల భద్రత-మానసిక సంక్షేమం కోసం ప్రస్తుతం అమలు చేస్తున్న చర్యలపై వివరమైన నివేదికతో హాజరు కావాలని ఆదేశించింది.

పల్లె పల్లెకు ప్రగతి వెలుగులు నా హామీ

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- గ్రామాల్లో మంచివారిని సర్పంచులుగా ఎన్నుకోండి



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్3: ఎన్ని పార్టీలు ఉన్నా అందరూ ఒక వేదిక మీదకు వచ్చి గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ఏకగ్రీవం వైపు అడుగులు వేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ పదవి ఏకగ్రీవం కావడంతో బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో సర్పంచ్ గా ఎన్నికైన గోపాల్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడి లేకుండా, ఎలాంటి ప్రలోభాలకు ఆస్కారం కలిగించకుండా ప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఉపసంహరించుకున్న అభ్యర్థులు, సహకరించిన గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేగా పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతుందని, గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ బలపరిచిన వారు అదే విధంగా మంచి అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నా కొడుకు వర్ధంతికి అడ్డుపడుతున్నారు

- శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ ఆరోపణ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 3 : తెలంగాణ ఉద్యమ మలి దశ అమరుడు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి రోజున శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీపైన, జిల్లా మంత్రులపై, స్థానిక ఎమ్మెల్యే పై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో శ్రీకాంతాచారి వర్ధంతి, జయంతి బాగా చేసారన్నారు. కొన్ని పరిస్థితుల కారణంగా తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని, గత మూడు సంవత్సరాల నుండి కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 'సొంత నియోజకవర్గంలో విగ్రహాలు పెట్టొద్దని, జయంతి, వర్ధంతి చేసుకోవద్దు' అని కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. శ్రీకాంతాచారి ఆత్మబలిదానం వల్ల వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో జిల్లా కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యే బుగ్గ కారులలో తిరుగుతూ మూడు సంవత్సరాల నుండి విగ్రహాలు పెట్టకుండా, వర్ధంతి, జయంతి చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ కారణంగా తాను మోసపోయానన్నారు. 'నా కొడుకు వర్ధంతిని ఉత్తమ్ కుమార్ రెడ్డి నాలుగవ తారీకున పెట్టుకొన్నారు. వర్ధంతి కార్యక్రమాన్ని మందుల సామెల్ తో కలిసి చెడగొట్టారని' శంకరమ్మ వాపోయారు.

కడ్తాల్ వద్ద కారు దగ్ధం

- నలుగురు ప్రయాణికులు సురక్షితం



ప్రతిపక్షం, కడ్తాల్, డిసెంబర్ 3 : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో బుధవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మక్తమాదారం గేటు వద్దకు రాగానే ఆ ప్రమాదం జరిగింది. సడెన్‌గా మంటలు వ్యాపించడంతో ఆ కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఎవరూ గాయపడలేదు. మంటలలో కారు పూర్తిగా దగ్ధమైంది. తలకొండపల్లి మండలం వెంటాపూర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సమయంలో కారు అగ్ని ప్రమాదానికి గురైంది. అయితే అందులో ఉన్న ప్రయాణికులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కారులో యువకులు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్థానిక పోలీసులు వెల్లడించారు.



"2023 డిసెంబర్3న బీఆర్ఎస్‌పదేళ్ల పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. శ్రీకాంతాచారి బలిదానం కూడా ఇదేరోజు జరిగింది. ఆయన స్ఫూర్తితో 60వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. మరో 40వేల కోసం ప్రణాళికలు రచిస్తున్నాం. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం. 2001లో ఈ ప్రాంతం నుంచే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. 2004లో కరీంనగర్‌లో సోనియా ప్రత్యేక రాష్ట్రంపై మాటిచ్చారు.

- హుస్నాబాద్ సభలో సీఎం రేవంత్

ఓపెన్ వాయిస్

బలోపేతమవుతున్న భారత ఆర్థిక వ్యవస్థ

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం బలంగా, స్థిరంగా పెరుగుతున్నదని తాజా లెక్కలు తెలియజేస్తున్నాయి. ఈసారి జీడీపీ భారీ పెరుగుదలను నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశం వృద్ధి రేటు సాధించింది. తాజా అధికారిక గణాంకాల ప్రకారం, 30 సెప్టెంబర్ 2025 ముగిసే రెండవ త్రైమాసికంలో దేశ స్థూల దేశీయోత్పత్తి 8.2 శాతంగా పెరుగుదల నమోదు చేసింది. భారత ఆర్థిక వ్యవస్థ సెప్టెంబర్ 2024 త్రైమాసికంలో 5.6 శాతం వృద్ధి చెందింది ఇది ఏడు త్రైమాసికాలలో అత్యల్ప రేటు. మునుపటి త్రైమాసికంలో 7.8 శాతం నుంచి కోలుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో వాస్తవ ధరల వద్ద జీడీపీ రూ.48.63 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో రూ.44.94 లక్షల కోట్లుగా ఉంది. ఇది 8.2 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. 2025 -26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో నామమాత్రపు జీడీపీ, ప్రస్తుత ధరల వద్ద జీడీపీ రూ.85.25 లక్షల కోట్లని అంచనా వేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో రూ.78.40 లక్షల కోట్లు ఉంది. ఇది 8.7 శాతం వృద్ధి రేటును చూపుతోంది. ముఖ్యంగా ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎకోసిస్టమ్ వేగంగా విస్తరించడం ఈ వృద్ధికి అద్దం పడుతోంది. పోర్ట్‌ఫోలియో మేనేజ్ మెంట్ సర్వీసులు, అల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ వంటి పెట్టుబడులు పదేండ్లలో 31.24 శాతంతో పెరుగుతున్నాయి. 2015లో ఈ పెట్టుబడులు రూ. 1.54 లక్షల కోట్లు ఉండగా, 2025లో పరాయి పెట్టుబడులు రూ. 23.43 లక్షల కోట్లకు చేరాయి. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక పరిస్థితులు, అనిశ్చితులు పెట్టుబడిదారులను సంప్రదాయ ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి బయటకు నడిపించి, కొత్త ప్రత్యామ్నాయాల వైపునకు మళ్లించాయి. స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రొఫెషనల్స్, యువ పెట్టుబడిదారులు మాత్రమే కాదు. చిన్న పట్టణాలలో కూడా ఆల్టర్నేటివ్ పెట్టుబడులపై ఆసక్తి భారీగా పెరుగుతోంది. పరిశ్రమ పదేళ్లలో 1.27 లక్ష కోట్ల నుంచి 8.37 లక్షల కోట్లుకు ఎగబాకిందంటే, ఎంత డెవలప్‌మెంట్ ఉందో అర్థం చేసుకోవచ్చు. పరిశ్రమ రంగం కూడా 49.23 శాతంతో అత్యంత వేగంగా విస్తరణ చెందింది. ఇక దేశంలో గృహ వినియోగ వంట గ్యాస్ వినియోగం కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ తాజా గణాంకాల ప్రకారం 2024-25లో దేశవ్యాప్తంగా గృహ గ్యాస్ వినియోగం 31.3 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరింది. ఇది కేవలం డిమాండ్ పెరుగుదలకే సంకేతం కాదు, సురక్షిత, శుభ్రమైన వంట ఇంధనాల వైపు దేశం మొగ్గు చూపుతున్నట్టు కూడా సూచిస్తోంది. గత ఇరవైయేండ్లలో దేశంలో గ్యాస్ వినియోగం దాదాపు మూడు రెట్ల దాకా పెరిగింది. 2004-05లో 10.2 ఎంఎంటీ, 2013-14లో 16.3 ఉండగా, పెద్ద ఎత్తున పెరుగుదల గత దశాబ్దంలోనే నమోదైంది. 2024-25 నాటికి వినియోగం 31.3 ఎంఎంటీకి చేరి, 2013-14తో పోలిస్తే రెండింతలకు పైగా పెరిగింది. మోడీ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా గ్యాస్ కనెక్షన్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఉజ్వల పథకం ద్వారా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో వంట గ్యాస్‌ను వినియోగించడం ప్రారంభించాయి. అదనంగా దేశంలో గ్యాస్ సరఫరా వ్యవస్థ గణనీయంగా బలోపేతమైంది. రిఫైనరీ సామర్థ్యం పెరగడం, పెద్ద గోదాములు, మెరుగైన పంపిణీ నెట్వర్క్ కారణంగా గ్యాస్ రీఫిల్ అందుబాటు సులభమైంది. ఇటీవలి కాలంలో గ్యాస్ ధరలు తగ్గటం కూడా డిమాండ్‌పై ప్రభావం చూపింది. ఈ నెలలో గృహ ఎల్ పీజీ ధరల్లో మార్పు లేకపోయినా, కమర్షియల్ గ్యాస్ ధరలు మాత్రం తగ్గాయి. మూడీస్ రేటింగ్స్ 2025 లో 7 శాతం జిడిపి విస్తరణ, వచ్చే ఏడాది 6.4 శాతంతో భారతదేశం అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వృద్ధికి సూచిక అని తెలిపింది. ప్రపంచ అనిశ్చితి మధ్య భారతదేశం దేశీయ వృద్ధి దాని ఆర్థిక స్థితిస్థాపకతను బలపరుస్తాయని మూడీస్ తెలిపింది.

హైదరాబాద్,

గురువారం
04.12.2025

రూ. కోట్ల కోసమే కాంగ్రెస్ హిల్ట్ పాలసీ

రాష్ట్రంలో దాదాపు 152 పారిశ్రామికవాడలలో 28 వేల కంపెనీలు ఉన్నాయి. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 22 పారిశ్రామికవాడలో 12,578 కంపెనీలు నడుస్తున్నాయి. ఇప్పుడు ఆయా పారిశ్రామికవాడలలో ఇండ్లను నిర్మించడం సరికాదని, భవిష్యత్తులో పర్యావరణ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అటు పలువురు పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం హిల్ట్ పాలసీని అమలు చేసి, అమాయక ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. ఈ స్థలాలలో మల్టీ యూస్ జోన్స్‌గా ఏర్పాటుచేసి అపార్టుమెంట్లు ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్, స్కూలు, ఆస్పత్రి, హోటల్, కమర్షియల్ ఆఫీసులు ఎలా కడతారో తెలియని పరిస్థితి. ఎవరి స్వార్థం వారు చూసుకుని పోతే చివరికి ఆ స్థలాలను కొనుగోలు చేసే అమాయక ప్రజలు బలి అవుతారు.



డా. చిన్నమైల్ అంజిరెడ్డి
9848010980

హైదరాబాద్ సిటీకి చాలా దూరంలో ఉన్న ఏరియాలో ఎకరాకు రూ. 150 కోట్లు ధర ఉంటే, సిటీ మధ్యలో ఉన్న ప్రాంతానికి దాదాపు రెండు రేట్ల ఎక్కువ రేట్ ఉండాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ రేటుతో సంబంధం లేకుండా అంగట్లో సరుకు లాగా తక్కువ ధరకు ప్రభుత్వ భూములను బడా పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేస్తూ భారీ కుంభకోణానికి తెర తీస్తుంది. దాదాపు పదేండ్ల కిందట ప్రభుత్వం తీసిన జీఓను రీ షెడ్యూల్ చేస్తూ, నియమ నిబంధనలకు విరుద్ధంగా జీఓ 27 ని విడుదల చేసి హిల్ట్ పాలసీ అమలు చేస్తున్నది. జీహెచ్ఎంసీ పరిధిలోని 22 పారిశ్రామికవాడలలో దాదాపు 92, 92 ఎకరాలను మల్టీ యూస్ జోన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోంది. మార్కెట్ రేట్ తో సంబంధం లేకుండా సబ్ రిజిస్ట్రేషన్ వ్యాల్యూ (ఎస్ఆర్ఓ) ప్రకారం దాటిలో 30 శాతం ప్రభుత్వానికి చెల్లిస్తే సరిపోతుంది. ఈ లెక్కన మార్కెట్ వ్యాల్యూలో రెండు కోట్లు ఉన్న భూమి అదే భూమి ఎస్ఆర్ఓ ప్రకారం కేవలం రెండు లక్షలు ఉంటే, అందులో 30 శాతం రూ. 60 వేలు చెల్లిస్తే సరిపోతుంది. బహిరంగ మార్కెట్ వేలంలో 9,292 ఎకరాల భూమికి ప్రభుత్వానికి ఐదు లక్షల కోట్ల ఆదాయం వచ్చే భూములను, కేవలం ఆరు వేల కోట్లకే పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టి, భారీ కుంభకోణం తెర లేపుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది.

ఐదు లక్షల కోట్ల భూ స్కామ్ కోసమే

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ. ఐదు లక్షల కోట్ల భూ స్కామ్ కోసమే 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ లాండ్స్ ట్రాన్స్‌పర్మేషన్' పాలసీని తెచ్చింది. దాదాపు 9,292 ఎకరాల ప్రభుత్వ భూమిని అడ్డికి పావుసేరు చొప్పున బడా కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తలు ధారాదత్తం చేస్తోంది. సిటీ మధ్యలో పారిశ్రామికవాడలు ఉంటే పొల్యూషన్ అవుతుందని కారణంతో పోరాడి సాధించుకున్న తెలంగాణ వనరులను భవిష్యత్ తరాలకు మిగలకుండా పెద్ద కుట్ర చేస్తోంది. నిజాం కాలంలోనూ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కేవలం రూ. 5, 10 లకే ఎకరం చొప్పున రాయితీ మీద పరిశ్రమల స్థాపన కోసం ఇక్కడి ప్రజల ఉద్యోగ, ఉపాధి కోసం ప్రభుత్వం ఇచ్చిన భూములలో ప్రస్తుతం ప్రయివేట్ వ్యక్తులు ఆపార్టుమెంట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఏంటి? ప్రయివేట్ వ్యక్తుల లాభం కోసం ప్రజల సంపదను ఇవ్వడం సబబు కాదు. ఒక్క పక్క ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం ప్రభుత్వ స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేలాది ఎకరాలు ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడం కరెక్ట్ నా? రూ. కోట్ల పెట్టుబడితో నడుస్తున్న పరిశ్రమలను



మూసివేసి, ఎలాంటి వనరులు లేని చోట కొత్తగా పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ఏ పారిశ్రామికవేత్త సాహిసిస్తాడు? అటు, మూతబడిన పరిశ్రమల యజమానుల మాదిరిగానే తమ పరిశ్రమల భూములను కూడా తక్కువకు మల్టిపుల్ జోన్లుగా మార్చుకొని, ఎంచక్కా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారు. అంటే, కాలుష్యాన్ని ఔటర్ అవతలికి తరలించడం దేవుడె గురు! ఉన్న పరిశ్రమలు మూతబడి ఉత్పత్తితో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గండి పడే అవకాశం ఉంది.

నడపని పరిశ్రమలకు రాయితీ!

కాలుష్యరహిత, అసలు నడపని పరిశ్రమలకు కూడా హిల్ట్ కింద ఎందుకు రాయితీ ఇస్తున్నట్లు? వాటి నుంచి కాలుష్యమనేదే రానపుడు భూములను కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకునేందుకు ఎందుకు ప్రోత్సహిస్తున్నట్లు? ఔటర్ లోపల జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 22 పారిశ్రామికవాడలలో వేలాది పరిశ్రమలు చాలా యేండ్లుగా మూతబడ్డాయి. పరిశ్రమ నడవకుండా కాలుష్యం రాని, ఎవరికీ ఉపాధి కల్పించని భూములను మార్కెట్ రేట్ కంటే తక్కువ రేట్ కు అప్పగించడం మీద అంతర్యమేమిటో వారికే తెలియాలి. వాస్తవానికి కాలుష్యరక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలించాలనే ప్రతిపాదన చాలా యేండ్ల కిందట నుంచే ఉండేది. కానీ, ఇప్పటివరకు దీనిని సంపూర్ణంగా ఏ ప్రభుత్వం అమలు చేయకపోగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరబాదరగా జీఓ 27 తీసుకువచ్చింది. దీంతో అత్యంత వేగంగా, రాత్రికి రాత్రే ఈ ప్రక్రియ ముగిస్తామంటూ హిల్ట్ పాలసీని తెర పైకి తెచ్చింది. కేవలం 45 రోజులలోనే పాలసీని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు షెడ్యూలు ప్రకటించింది. కనీసం దీనిపై క్షేత్రస్థాయి పరిస్థితులు, వాస్తవాలు, పారిశ్రామికరంగం దెబ్బతినకుండా కనీస అధ్యయనంగానీ పరిశీలనగానీ చేయలేదు.

చాలా వరకు కాలుష్యరహిత పరిశ్రమలే

ఈ 22 పారిశ్రామికవాడలలో చాలా వరకు కాలుష్యరహిత పరిశ్రమలే ఉన్నాయి. అంతేకాక, సాక్షాత్తు పీసీబీనే ఆ పరిశ్రమల నుంచి కాలుష్యం వెలువడదని నిర్ధారించింది. ఇప్పుడు హిల్ట్ పాలసీ కింద ఆ పరిశ్రమల భూములను మల్టిపుల్ జోన్లుగా మార్చడం, ప్రజల సంక్షేమ కోసం అంటే ఎలా! ఇది ముమ్మాటికి రియల్ రంగాన్ని ప్రోత్సహించి దోచుకోవడమే కదా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ఖజానాకు గండిపడే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ పోరాటం చేస్తుంది. ఈ పాలసీని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ నాయకత్వం గవర్నర్‌ను కలిసి వినతి పత్రం కూడా అందించింది. అంతేకాక ఈ విషయంలో రాజీలేని పోరాటం చేస్తుంది. ఈ నెల ఏడున ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. అన్ని వర్గాల ప్రజలతో ఏకమై ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను వ్యతిరేకిస్తాం. హిల్ట్ పాలసీని రద్దు చేసే వరకు పోరాటాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తాం.

ఇండ్లను నిర్మించడం సరికాదని

రాష్ట్రంలో దాదాపు 152 పారిశ్రామికవాడలలో 28 వేల కంపెనీలు ఉన్నాయి. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 22 పారిశ్రామికవాడలో 12,578 కంపెనీలు నడుస్తున్నాయి. ఇప్పుడు ఆయా పారిశ్రామికవాడలలో ఇండ్లను నిర్మించడం సరికాదని, భవిష్యత్తులో పర్యావరణ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అటు పలువురు పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం హిల్ట్ పాలసీని అమలు చేసి, అమాయక ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. ఈ స్థలాలలో మల్టీ యూస్ జోన్స్ గా ఏర్పాటుచేసి అపార్టుమెంట్లు ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్ లు, స్కూలు, ఆస్పత్రి, హోటల్, కమర్షియల్ ఆఫీసులు ఎలా కడతారో తెలియని పరిస్థితి. ఎవరి స్వార్థం వారు చూసుకుని పోతే చివరికి ఆ స్థలాలను కొనుగోలు చేసే అమాయక ప్రజలు బలి అవుతారు.

(వ్యాస రచయిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, కరీంనగర్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

అవరోధాలు దాటి, ఆత్మవిశ్వాసంతో



జనక మోహనరావు దుంగ
8247045230

సమాజంలో ప్రతి వ్యక్తీ గౌరవంగా జీవించే హక్కును కలిగి ఉంటారు. అయితే, శారీరకంగా లేదా మానసికంగానూ కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నవారిని మనం గతంలో 'వికలాంగులు' అని పిలిచేవాళ్లం. కానీ, వారిలో దాగి ఉన్న అంతర్గత శక్తిని, ప్రత్యేక ప్రతిభను గుర్తించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారిని 'దివ్యాంగులు' అని సంబోధించడం ఒక సామాజిక మార్పుకు నాంది పలికింది. దివ్యాంగులు అంటే కాళ్లు, చేతులు లేనివారు మాత్రమే కాదు, దృష్టి లోపం, వినికిడి లోపం, మానసిక వైకల్యం, చలన సంబంధిత సమస్యలు ఉన్న వారందరూ ఈ కోవలోకి వస్తారు. 1995 నాటి చట్టం ప్రకారం ఏడు రకాల వైకల్యాలను మాత్రమే గుర్తించగా, 2016లో వచ్చిన నూతన చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలను భారత ప్రభుత్వం గుర్తించింది. ఇందులో ఆసిడ్ దాడి బాధితులు, పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్తులను కూడా చేర్చారు.

దివ్యాంగుల జనాభా గణాంకాలు

భారతదేశంలో దివ్యాంగుల జనాభా గణాంకాలను పరిశీలిస్తే, 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో దాదాపు 2.68 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారు. ఇది దేశ మొత్తం జనాభాలో సుమారు 2.21 శాతంగా ఉంది. ఇందులో స్త్రీ, పురుషుల నిష్పత్తిని గమనిస్తే, మొత్తం దివ్యాంగులలో పురుషులు 56 శాతంగా ఉండగా, మహిళలు 44 శాతంగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలోనే అత్యధిక శాతం దివ్యాంగులు నివసిస్తున్నారు. ఇక అక్షరాస్యత విషయానికి వస్తే, జాతీయ సగటుతో పోల్చితే వీరిలో అక్షరాస్యత తక్కువగానే నమోదైంది. 2011 గణాంకాల ప్రకారం దివ్యాంగులలో అక్షరాస్యత 55 శాతంగా మాత్రమే ఉంది. అటు, ఉద్యోగ రంగంలో వీరి ప్రాతినిధ్యం చాలా ఆందోళనకరంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య చాలా తక్కువ. సుమారు 64 శాతం మంది దివ్యాంగులు నిరుద్యోగులుగా లేదా ఎటువంటి ఉత్పాదక పనులలో పాల్గొనలేనివారిగా మిగిలిపోతున్నారని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలలో వీరికి రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, అనేక బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోవడం విచారకరం.



ప్రత్యేక రక్షణ

భారత రాజ్యాంగం దివ్యాంగులకు ప్రత్యేక రక్షణ కల్పిస్తోంది. రాజ్యాంగంలోని అధికరణ 14 అందరికీ సమానత్వాన్ని ప్రసాదిస్తుండగా, అధికరణ 15 వివక్షను నిషేధిస్తుంది. ముఖ్యంగా అధికరణ 41 ప్రకారం, నిరుద్యోగం, వృద్ధాప్యం, అనారోగ్యం లేదా వైకల్యం ఉన్న సందర్భాలలో ప్రజలకు పని హక్కు, విద్యా హక్కు, ప్రభుత్వ సహాయం పొందే హక్కును కల్పించాలని రాజ్యాంగం రాజ్యానికి నిర్దేశించింది. ఈ రాజ్యాంగ స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక 'దివ్యాంగుల హక్కుల చట్టం 2016'ను తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రభుత్వ ఉద్యోగాలలో దివ్యాంగుల రిజర్వేషన్లను మూడు శాతం నుండి నాలుగు శాతానికి పెంచడమే కాకుండా, అటు, ఉన్నత విద్యా సంస్థలలో ఐదు శాతం సీట్లను కేటాయించింది. ఎవరైనా దివ్యాంగులను అవమానిస్తే లేదా వారి పట్ల వివక్ష చూపితే కఠిన శిక్షలు విధించే వెసులుబాటును కూడా ఈ చట్టం కల్పించింది.

సంక్షేమ పథకాలు

కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక ప్రత్యేకమైన కార్యక్రమాలను అమలు చేస్తోంది. అందులో అత్యంత ప్రధానమైనది 'సుగమ్య భారత్ అభియాన్'. ప్రభుత్వ కార్యాలయాలు, రవాణా వ్యవస్థలు, వెబ్‌సైట్లు అన్నీ దివ్యాంగులకు సులభంగా అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశం. అలాగే, దివ్యాంగులకు సహాయక పరికరాలు అంటే, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలలాంటివి ఉచితంగా పంపిణీ చేయడానికి అటు 'ఎడిప్' పథకం కూడా అమలులో ఉంది. దేశవ్యాప్తంగా దివ్యాంగులు ఏ రాష్ట్రానికి వెళ్లినా వారి ధ్రువీకరణ చెల్లుబాటయ్యేలా 'యూడీఐడీ' కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం ఈ చేసింది. దీనితో వారు సంక్షేమ పథకాలను దేశంలో ఎక్కడైనా పొందే అవకాశం కలుగుతుంది. ఇవే కాకుండా నేషనల్ ఫెలోషిప్స్ ద్వారా దివ్యాంగ విద్యార్థులకు ఆర్థిక సహాయం కూడా అందుతోంది.

వివక్షను పారద్రోలాలి

ఎన్ని చట్టాలు, పథకాలు ఉన్నప్పటికీ, సమాజంలో దివ్యాంగులు నేటికీ తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారు. ఈ వివక్ష ప్రధానంగా మూడు రంగాలలో కనిపిస్తుంది. మొదటిది సామాజిక వివక్ష. ఇప్పటికీ మన సమాజంలో వైకల్యాన్ని పూర్వజన్మ పాపంగానో లేదా ఒక శాపంగానో చూసే ధోరణి గ్రామీణ ప్రాంతాలలో ఉంది. శుభకార్యాలకు దూరంగా ఉంచడం, వారి సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయడం జరుగుతోంది. రెండవది నిర్మాణాత్మక వివక్ష. నేటికీ అనేక ప్రయివేటు సంస్థలు, ప్రయివేటు పాఠశాలలు, ఏటీఎంలు, బస్సులలో ర్యాంపులు లేకపోవడంతో వారు ఇతరుల సహాయం లేకుండా కదలలేని పరిస్థితి ఉంది. మూడవది విద్యా, ఉద్యోగ వివక్ష. ప్రధానంగా ప్రభుత్వేతర పాఠశాలలలో దివ్యాంగ పిల్లలను చేర్చుకోవడానికి యాజమాన్యాలు వెనుకాడుతున్నాయి. అలాగే, ఉద్యోగాలలో వారు పని చేయలేరేమో అనే అపోహతో అర్హత ఉన్నప్పటికీ అవకాశాలను నిరాకరిస్తున్నారు.

సామాజిక స్పృహ అవసరం

ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వ కృషి మాత్రమే సరిపోదు, సామాజిక దృక్పథంలో మార్పు రావాలి. ముందుగా 'చేతకాదు' అనే భావన నుండి 'చేయగలరు' అనే నమ్మకాన్ని వారిలో, సమాజంలో కలిగించాలి. ప్రభుత్వ భవనాలు, పార్కులు, సినిమా హాళ్లు, రవాణా వ్యవస్థలను పూర్తిగా దివ్యాంగులకు అనుకూలంగా మార్చాలి. సమ్మిళిత విద్య ద్వారా సాధారణ పిల్లలతో పాటే దివ్యాంగ పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించాలి. దీనివల్ల చిన్నప్పటి నుండే పిల్లల్లో సమానత్వ భావన పెరుగుతుంది. ప్రైవేటు రంగంలో కూడా దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలకు పన్ను రాయితీలు ఇవ్వడం ద్వారా ప్రోత్సహించవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా, వైకల్యం అనేది శరీరానికి సంబంధించినదే తప్ప, మనసుకు లేదా ప్రతిభకు కాదనే సత్యాన్ని ప్రతి పౌరుడు గ్రహించాలి. అప్పుడే మనం నిజమైన అర్థంలో ప్రగతిశీల సమాజంగా ఎదుగుతాం.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

మానవత్వం, ధైర్యం, ఐక్యతకు నిదర్శనాలు



ముహమ్మద్ ముజాహిద్
9640622076

మన చుట్టూ అన్యాయం, కష్టాలు, విపత్తులు ఉన్నప్పటికీ, తోటి మనిషి పట్ల ప్రేమ, కరుణ ఇంకా బతికే ఉన్నాయని నిరూపించడానికి అప్పుడప్పుడూ కొన్ని అద్భుత ఘటనలు జరుగుతుంటాయి. ఈ రెండు కథనాలు మన భుజాలపై ఉన్న బాధ్యతను, మానవత్వంలోని అపారమైన శక్తిని గుర్తుచేస్తున్నాయి. మునిగిపోతున్న ప్రాణాన్ని నిలబెట్టిన ఫైజల్ సాహసం (The Courage of the Moment). ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ జిల్లాలో జరిగిన ఈ ఘటన, క్షణం విలువను, తక్షణ స్పందన (Prompt Action) గొప్పతనాన్ని చాటి చెప్పింది. శుభమ్ తివారీ తన కారులో ప్రయాణిస్తున్నప్పుడు, ఒక చిన్నారిని రక్షించే ప్రయత్నంలో నియంత్రణ కోల్పోయి, ఎస్‌యూవీతో సహా చెరువులో పడిపోయారు. వాహనం వేగంగా నీటిలో కూరుకుపోవడం మొదలు పెట్టింది. లోపల తివారీ అపస్మారక స్థితిలో నిస్సహాయంగా ఉండిపోయారు. అదే సమయంలో, పడవలో ఉన్న ఫైజల్ ఈ ప్రమాదాన్ని చూశాడు. ఒక క్షణం కూడా ఆలోచించలేదు. తన ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా, ధైర్యంతో వెంటనే నీటిలోకి దూకాడు. వాహనం బరువును, నీటి ఒత్తిడిని లెక్కచేయకుండా, అపస్మారక స్థితిలో ఉన్న తివారీని చివరి క్షణంలో బయటకు లాగాడు. ఫైజల్ ఈ సాహసం వల్లే తివారీ ప్రాణాలు దక్కాయి. ఫైజల్ చూపిన వీరోచిత మానవత్వం, ఏ మనిషైనా ఆపదలో ఉంటే వెనుకాడకూడదని మనకు స్పష్టమైన సందేశం ఇచ్చింది.

కూల్చివేతలోనూ గెలిచిన ఐక్యత

శర్మ కుటుంబం అండ (The Compassion in Crisis) ఒకవైపు కూల్చివేత, మరొకవైపు కలకాలం నిలిచే కరుణ. జమ్మూలో జర్నలిస్ట్ అర్షద్ దార్ ఇంటిని అకస్మాత్తుగా కూల్చివేయడంతో ఆయన కుటుంబం నిరాశ్రయులయ్యింది. అన్యాయం గెలిచిందనుకున్న ఆ నిస్సహాయ క్షణంలో, జమ్మూకు చెందిన ప్రేమ్ పాల్ శర్మా కుటుంబం ముందుకు వచ్చింది. ఎలాంటి మత, సామాజిక భేదం లేకుండా, కేవలం మానవత్వం దృష్టితో, హిందూముస్లిం ఐక్యతకు అత్యున్నత ఉదాహరణగా నిలిచారు. వారు వెంటనే తమ సొంత ఆస్తిలో ఉన్న ఏడు మార్లాల స్థలాన్ని (Seven Marla land) అర్షద్ కుటుంబానికి దానంగా



ఇచ్చారు. అంతేకాకుండా, వారికి ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. శర్మ కుటుంబం చేసిన ఈ పని, భవనం కూలిపోయినా, మనుషుల మధ్య విశ్వాసం, ప్రేమ, సామరస్యం అనే పునాదులు మాత్రం చెక్కుచెదరలేదని నిరూపించింది. దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టాలనుకునే శక్తులకు ఇది గట్టి సమాధానం.

స్ఫూర్తి: మానవత్వమే మన గొప్ప ధర్మం

ఈ రెండు కథనాలను కలిపి చూస్తే ఒకే సత్యం బోధపడుతుంది. మన జీవితంలో పెద్ద కష్టాలు ఎదురైనా, లేదా పక్క మనిషికి ఆపద వచ్చినా మనకు అండగా నిలిచేది మనలోని మానవత్వం మాత్రమే. ఒక ప్రాణాన్ని రక్షించడం. ప్రమాదం ఎదురైనప్పుడు ఏమీ ఆలోచించకుండా ఫైజల్ లాగా నిస్వార్థంగా సహాయం చేయడానికి మనసు ఉండాలి. శర్మ కుటుంబం లాగా, ఇతరులు అన్యాయానికి గురైనప్పుడు, మతాలు, ప్రాంతాలు చూడకుండా సానుభూతితో అండగా నిలబడాలి. జర్నలిస్ట్ అర్షద్ దార్ తన ఇల్లు కోల్పోయినా మానవత్వాన్ని పొందాడు. శుభమ్ తివారీ ప్రాణాలనే తిరిగి పొందారు. వీరిద్దరినీ నిలబెట్టింది వేర్వేరు మతాలకు, ప్రాంతాలకు చెందిన వ్యక్తులే అయినా, వారికి స్ఫూర్తినిచ్చింది మాత్రం ఒకే ఒక్క మానవ ధర్మం. మనం ఏ స్థితిలో ఉన్నా, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఆశను నింపగలిగే శక్తి మనలోనే ఉంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

ప్రాంతీయం



మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసెంబర్ 3: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్ లోని బస్తీ దవాఖాన వద్ద మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను సులభంగా అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య శిబిరంలో జనరల్ హెల్త్ చెకప్, బీపీ, షుగర్, కంటి పరీక్షలు వంటి పలు సేవలను నిపుణుల బృందం ఉచితంగా అందించింది. అవసరమైన మందులను కూడా శిబిరంలోనే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మెడిసిటి ఆసుపత్రి అందిస్తున్న సేవలను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి మెరుగైన సేవలను కొంసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు మేఘన,సాహితి, ప్రియ, మార్కెటింగ్ విభాగం సభ్యులు ఆర్ సంజయ్, బాబు, పి.చేరాలు, జి.రాఘవేంద్ర రెడ్డి, సిబ్బంది టి.కావ్య, సిహెచ్.కవిత, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం ఛైర్మన్ పేండం లక్ష్మీనారాయణ, జాతీయ కళా మండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్, నాయకులు ఈరగళ్ల మహేందర్, రామిడి శశిధర్ రెడ్డి, మోహిత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు





హయత్‌నగర్‌లో బాలుడిపై కుక్కలదాడి

- బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఎం
- మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులకు సీఎం ఆదేశం

ప్రతిపక్షం , సిటి బ్యూరో , డిసెంబర్ 3: హయత్ నగర్ లో మూగబాలుడు ప్రేమ్ చంద్ పై నిన్న వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే సీఎం చలించిపోయారు. వెంటనే సీఎంవో, జీహెచ్ఎంసీ అధికారులతో బుధవారం మాట్లాడారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఖర్చుకు వెనుకాడకుండా బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. బాలుడు ప్రేమ్ చంద్ వైద్య ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. బాలుడి కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. బాలుడు ప్రేమ్ చంద్ వైద్య ఆరోగ్య పరిస్థితి పై జీహెచ్ఎంసీ కమిషనర్ సమీక్ష బాలుడు ప్రేమ్ చంద్ వైద్య ఆరోగ్య పరిస్థితి పై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి వకీల్ లతో సమీక్షించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి సీఎం స్వయంగా ఆరా తీశారనీ, అతడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారని తెలిపారు. బాలుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కమిషనర్ సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని పబ్లిక్ ప్లేస్ లలో వీధి కుక్కలు లేకుండా ఇప్పటికే చేపట్టిన డ్రైవ్ ను మరింత ముమ్మరం చేయాలన్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలు ఈ ఘటనపై ఆరా తీసి బాలుడికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు.



రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మదహనం

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసంబర్ 3: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను బుధవారం బిజెపి నాయకులు దహణం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ ప్రధానకార్యదర్శి అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ, హిందూ దేవుళ్లపై రేవంత్ అవహేళన చేస్తూ మాట్లాడిన మాటలకు హిందువులంతా ఏకమావాల్సిన సమయం అసణమైందని తెలిపారు. హిందూ దేవుల జోలికివస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహబూనగర్ జిల్లా ఇంచార్జ్ రంజిత్ మోహన్, జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతి మాజీ పిఏసిఎస్ వైస్ ఛైర్మన్ జైతువాలా కిషన్, ప్రధానకార్యదర్శులు కృష్ణ, చింతల పూడి రామారావు, బిజెపి నాయకులు చెంచల సురేష్ ముదిరాజ్, సుంకు నవీన్, అభిలాష్,అరుణ్, వినోద్, వినయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రద్దు చేయొద్దు

- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం, సిటీబ్యూరో, డిసెంబర్ 3: మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్కే పురం, సరూర్నగర్ డివిజన్‌లలో గత ప్రభుత్వ హయాంలో 167 మంది లబ్ధిదారులకు మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రద్దు చేసే యోచనలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని తెలిసి, బాధితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ తరుణంలో, లబ్ధిదారుల బృందం ఈరోజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ కాలంలో తాము నిజాయితీగా అర్హత సాధించి పొందిన 167 ఇళ్లను రద్దు చేస్తారని వినిపిస్తున్న వార్తలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వెంటనే స్పందించి రంగారెడ్డి జిల్లా హౌసింగ్ బోర్డ్ పిడి డి.సి. నాయక్ కు ఫోన్ చేసి, ఇప్పటికే మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రద్దు చేయవద్దని, బాధితులపై తక్షణ రీ-ఎంక్వైరీ జరిపి, అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారుల సమస్యను వెంటనే పట్టించుకుని స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురుకుంట్ల అరవింద్, కంచర్ల శేఖర్, ఆర్కే పురం & సరూర్నగర్ డివిజన్‌లలో డబుల్ బెడ్ రూమ్ మంజూరైన లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



రూ.35 వేల కోట్లవిలువైన 700 ఎకరాల భూమిని

ప్రభుత్వం రూ.2100 కోట్లకే అమ్మాలని చూస్తుంది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

ప్రతిపక్షం , సిటి బ్యూరో , డిసెంబర్ 3 : రూ. 35 వేల కోట్ల 700 ఎకరాల భూమిని ప్రభుత్వం కేవలం రూ.2100 కోట్లకే అమ్మాలని చూస్తుంది అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ మహానగరంలో హిల్టప్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్రను అడ్డుకునేందుకు నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంఎల్సీ వాణి దేవి తో కలిసి మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పర్యటించారు. అనంతరం మాజీ మంత్రి,ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి , ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్టప్ పాలసీలో పెద్ద కుట్ర కోణం ఉందన్నారు. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం నాచారం ఇండస్ట్రియల్ ఏరియాను 700 ఎకరాలతో నిర్మించింది. పొల్యూషన్ చేసే కంపెనీలను తరలించాలి అనే సాకుతో పొల్యూషన్ చేయని కంపెనీలను కూడా తరలించాలని చూస్తున్నారన్నారు. ఇండస్ట్రీల ప్రకారం రూ.11 కోట్ల ధర, సబ్ రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారం రూ.8 కోట్ల ధర పలికే ఎకరం భూమిని రూ.2.50-3 కోట్లకే ఇస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంటే దాదాపు రూ.35 వేల కోట్ల 700 ఎకరాల భూమిని కేవలం రూ.2100 కోట్లకే అమ్మాలని చూస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ , ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.



బోడుప్పల్ లో వజ్రేష్ యాదవ్ పర్యటన

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసెంబర్ 3: అర్హులైన నిరుపేద కుటుంబాలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. బుధవారం బోడుప్పల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో 29 మంది లబ్ధిదారులకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల గృహసంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలనే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నరసింహరెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, తోటకూర రాజు యాదవ్, రాపోలు ఉపేందర్ పాల్గొన్నారు.




కార్యకర్త కుటుంబానికి నవీన్‌యాదవ్ పరామర్శ

ప్రతిపక్షం , సిటీబ్యూరో , డిసెంబర్ 3 : తన అభిమాని కుటుంబాన్ని పరామర్శించి.. ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపు కోసం నెల రోజులు కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో చురుకుగా పాల్గొన్న రాజన్న సిరిసిల్ల జిల్లా..ఇల్లంతకుంట మండలం.. సిరికొండ గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబెర్ ఉమ్మరవేణి రాజు యాదవ్ గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నవీన్ యాదవ్ వారి కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. బుధవారం దశదినకర్మ కార్యక్రమానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం ఆర్థిక సహాయం చేసి..వారి కూతురు అభినయ ఉన్నత చదువులకు బాధ్యత వహిస్తానన్నారు.. ఈ సందర్భంగా ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- తెలంగాణ జాగ్రుతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి



ప్రతిపక్షం, చేవెళ్ల, డిసెంబర్3: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవా సందర్భంగా తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి విలేకర్ల సమావేశంలోమాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఇస్తున్న పించన్‌లను పెంచుతామని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్ల పెంపు అంశం విస్మరించారన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయినా పింఛన్ పెంపు లేకపోగా.. ఉన్న పింఛన్‌లు ఎప్పుడు వస్తున్నాయో తెలియని పరిస్థితి నెల కొందన్నారు. దివ్యాంగులకు పింఛన్ పెంపు అమల్లో చేయకుండా ముఖ్యమంత్రి దగా చేస్తున్నాడని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు తక్షణమే రూ.6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించే పెన్షన్ పథకాలు కేవలం రాజకీయ వాగ్దానాలకే పరిమితం కాకుండా, నిత్యజీవనంలో అవసరమైన మద్దతు కావాలని వారికి అండగా నిలవాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ వికలాంగ సమాజంపై చిన్నచూపు చూస్తుందన్నారు. వారి సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఆధునికఉపకరణాల పంపిణీ ప్రత్యేక ఉపాధి కోటా వంటి హామీలు గాలిలో కలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులు సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు పొందేలా ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో పింఛన్ పెంపుపై ఇచ్చిన హామీనీ ఇప్పటికైనా వెంటనే అమలు చేయాలని పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు.

జీహెచ్ఎంసీ నిధులతో అభివృద్ధి పనులు

- ప్రారంభించిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి
- బస్తీ బాట కార్యక్రమంలో సమస్యల పరిష్కారాం హామీల అమలు



ప్రతిపక్షం , సిటి బ్యూరో , డిసెంబర్ 3 : గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి తో కలిసి తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్ మరియు పార్థివాడ ప్రాంతాల్లో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, ఆరోగ్య శాఖ, నగర పల్లె అభివృద్ధి విభాగాలు, పర్యావరణ శాఖ అధికారులతో పాటు అనేక మంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు ప్రతి బస్తీలో ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను సమగ్రంగా నమోదు చేశారు. బస్తీ బాట సందర్శనలో ప్రధానంగా రహదారుల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణం, చెత్త వ్యవస్థలో లోపాలు, వీధిదీపాల పనితీరు, డ్రైనేజ్ బ్లాకేజీలు, నాలాల డీసిల్టింగ్, మంచినీటి సరఫరాలో అంతరాయాలు, కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ, పాఠశాలల చుట్టుపక్కల శుభ్రత, స్మశాన వాటిక అభివృద్ధి, బస్తీ దవాఖాన సేవల బలోపేతం వంటి పలువురు అత్యవసర సమస్యలు ప్రజల ద్వారా ప్రస్తావించబడ్డాయి. ప్రతి సమస్యపై అక్కడికక్కడే సంబంధిత అధికారులను డిప్యూటీ మేయర్ ఆదేశించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను నేరుగా వినడం, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడం తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. బస్తీ బాట కార్యక్రమం కేవలం సమస్యలను వినడానికి మాత్రమే కాకుండా, బస్తీ అభివృద్ధిని సమగ్రంగా పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన ఒక ప్రజామిత్ర కార్యక్రమమని వివరించారు. జిహెచ్ఎంసి లోని పలు డివిజన్లలో ఈ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించారు, ప్రజల నుండి వస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకుని దీనిని మరింత విస్తరించనున్నట్లు ఆమె చెప్పారు. బస్తీ అభివృద్ధి కోసం జిహెచ్ఎంసి కౌన్సిల్ సాంక్షన్ చేసిన రెండుకోట్ల నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఈ నిధులు పారదర్శకతతో పాటు అత్యవసర అవసరాలను బట్టి ఖర్చు చేయాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ముఖ్యంగా ఇంటీరియర్ రోడ్లు, కాలువలు, వీధిదీపాలు, వర్షాకాల డ్రైనేజ్ సమస్యలు, పార్కుల అభివృద్ధి, చిన్నారుల ఆట స్థలాలు, మహిళల కోసం రక్షిత ప్రదేశాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిహెచ్ఎంసి వ్యవస్థపై చూపుతున్న నిబద్ధతను డిప్యూటీ మేయర్ ప్రశంసిస్తూ, ఆయన బస్తీ స్థాయి నుండి నగర స్థాయి వరకు విస్తృతంగా పర్యవేక్షిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. అలాగే నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హైదరాబాద్ అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి విభాగంతో సమన్వయం చేసి పనులు నిర్వహిస్తున్నారని ఆమె అభినందించారు. బస్తీ బాట కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరగా ఉండే పాలనను అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజలు అభినందిస్తున్నారని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను నేరుగా డిప్యూటీ మేయర్‌తో పంచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఇంత కాలం పెండింగ్‌లో ఉన్న పనులు ఈ కార్యక్రమం ద్వారా వేగంగా పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు, చెత్త సేకరణ, డ్రైనేజ్ క్లీరెన్స్, నాళాల శుభ్రత, రోడ్ల మరమ్మతులపై తక్షణ స్పందన వస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ బస్తీ బాట కార్యక్రమం ద్వారా తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్, పార్థివాడ ప్రాంతాలు త్వరలోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలతో మమేకమై సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పునరుద్ఘాటించారు.



ఘనంగా దత్త పూర్ణిమ ఉత్సవాలు ప్రారంభం

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 3 : మండల పరిధిలోని కనకమామిడి దత్తాత్రేయ ఆలయంలో దత్త పూర్ణిమ ఉత్సవాలు మొదటి రోజు బుధవారం ఉపవాసములతో గురు దత్తకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలతో, పూలమాలలతో అలంకరించి ఉపవాసం ఉన్న స్వాములు పూజారిచే పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం సమర్పించారు. రెండవ రోజు గురువారం ఉదయం అభిషేక అలంకరణతో ప్రారంభం అవుతుందని ఆలయ నిర్వహకులు, పూజారులు పేర్కొన్నారు. అందరు పాల్గొని సద్గురు వారణాసి రామయ్య మందిరంలో దత్తపూర్ణిమ ఉత్సవాన్ని విజయవంతం చేసి స్వామివారి దర్శనంతో తీర్థప్రసాదం, అన్నదానం స్వీకరించాలని కోరారు.



హిందూ దేవుళ్లను సీఎం రేవంత్ అవమానించేలా మాట్లాడారు. సీఎం రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వానికి భూములు అమ్మకపోతే పూట గడవని పరిస్థితి ఉంది. రియల్ ఎస్టేట్ కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చేందుకు సీఎం రేవంత్ హిల్ట్ పాలసీని తీసుకొచ్చారు.
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 3: ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరంబండ కు చెందిన సుశీల్ కుమార్ శర్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ ఓ సి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని ఎమ్మెల్యే జిఎంఆర్ బుధవారం పటాన్చెరులోని తన కార్యాలయంలో సుశీల శర్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు పాండు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలో కలెక్టర్ పి. ప్రావీణ్య



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 3: దివ్యాంగులు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాలలో విజయాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్లోని ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ,దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, అప్పుడే వారు అనుకున్నది సాధించగలుగుతారన్నారు. అన్ని రంగాలలో దివ్యాంగులు సమాజంలోని సకలాంగులకు ఎంతమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. దివ్యాంగులు సంతోషంగా సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని సూచించారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.జిల్లాలో దివ్యాంగుల పిల్లల కోసం ఐఆర్సి సెంటర్ను ఏర్పాటు చేశామని, అన్ని వసతులతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ఎస్హెచ్ఈ ద్వారా పీడబ్ల్యుడి గ్రూప్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని అన్నారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం రెగ్యులర్గా ప్రతి క్వార్టర్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డీడబ్ల్యూఓకు సూచించారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా క్రీడలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన విజేతలకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అంతకుముందు దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ లలిత కుమారి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సౌజన్య,సిడిపిఓలు,దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రవీణ్, జుబేదా, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 3 : స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప నామస్మరణతో కనకమామిడి అయ్యప్ప దేవాలయ ప్రాంగణం మారుమోగింది. బుధవారం మండల పరిధిలోని కనకమామిడి అయ్యప్ప గుట్టపై అయ్యప్ప మహాపడి పూజను గురుస్వాములు రఘునందన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మహేందర్ రెడ్డి ,వేణు గురుస్వాములు కలిసి అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. 40 రోజుల పాటు మాల ధరించి కనకమామిడి నుంచి పాదయాత్రగా 120 మంది కనకమామిడి, సురంగల్, శంషాబాద్, షాబాద్ మండలాలకు చెందిన అయ్యప్ప స్వాములు శబరిమల యాత్రకు పాదయాత్రగా బయలుదేరారు. తిరిగి వచ్చిన అనంతరం బుధవారం అయ్యప్ప మహాపడి పూజను పెద్ద ఎత్తున నిర్వహించారు. దీంతో అయ్యప్ప దేవాలయ సన్నిధాన ప్రాంగణం అయ్యప్ప స్వాములతో పాటు భక్తులతో కిటకిటలాడింది. అయ్యప్ప స్వామి మహాపడి పూజ విధానాన్ని రఘునందన్ రెడ్డి గురుస్వామితో పాటు సుదర్శన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, వేణు గురుస్వాములు కలిసి 18 మెట్లపై కర్పూర హారతి వెలిగించారు. దీంతో అయ్యప్ప స్వామి పూజ కన్నుల పండుగగా జరిగింది. విచ్చేసిన భక్తులందరికి స్వామి వారి దర్శనం, తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అత్యధిక స్థానాలు బీజేపీ గెలుస్తుంది

- బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 3 :స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా లో అత్యధిక స్థానాలు బీజేపీ గెలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. బుధవారం రామచంద్రపురంలో జిల్లాలో బీజేపీ మద్దతు పలికిన సర్పంచ్ అభ్యర్థులు, జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీ లు ప్రజల నమ్మకాన్ని కోల్పోయాని, ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. 15 ఫైనాన్స్ నిధులతో గ్రామలకు కేంద్ర నిధులు అందుతున్నయన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం బీజేపీ మద్దతుగా పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులను గెలిపించిన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.



నిస్వార్థంగా పనిచేసే వారికే ఓటెయ్యండి..

- స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్.

ప్రతిపక్షం, భద్రాచలం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలనుకున్న వారికి మాత్రమే ఓటు వేయాలని భద్రాచలం స్వతంత్ర సర్పంచి అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్ అన్నారు. చట్టం ప్రకారం డబ్బు పంచడం నేరంగా పరిగణించబడుతుందని, ఎవరైనా డబ్బులతో ఓటును కొనాలను చూస్తే చట్టపరమైన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. నిస్వార్థంగా పనిచేసే వారికి ఓటుకు నోటు ఇవ్వాల్సిన అవసరం లేదని ఓటర్లంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. డబ్బులు పంచిన వ్యక్తి మరలా వడ్డీతో సహా డబ్బు లేని వసూలు చేసేందుకు ప్రయత్నిస్తారని పని చేసే వారికి పైసలు పంచల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. భద్రాచలం అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటుందని, ప్రజలందరూ ఆలోచించి నిజాయితీ గల వ్యక్తికి, సేవ చేసే వ్యక్తికి, భద్రాచలం అభివృద్ధికి పాటుపడే వ్యక్తికి మాత్రమే ఓటేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నికల ప్రచార ఖర్చులను పకడ్బందీగా నమోదు చేయాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 3: ఎన్నికల ప్రచార ఖర్చులను పోటీచేసే అభ్యర్థులు పకడ్బందీగా, స్పష్టంగా నమోదు చేయాలనీ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు పూర్తి ఖర్చుల రికార్డులతో వ్యయ పరిశీలకుల పరిశీలనకు మూడుసార్లు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల మేరకు 5 వేలకు పైగా జనాభా గల గ్రామపంచాయతీ లలో సర్పంచి అభ్యర్థి గరిష్ట వ్యయపరిమితి రెండు లక్షల 50 వేలు కాగా, వార్డు మెంబర్లకు 50 వేల వ్యయ పరిమితి గలదని తెలిపారు. 5 వేల లోపు జనాభా గల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి గరిష్ట వ్యయపరిమితి 1.5 లక్షలు, వార్డ్ మెంబర్ కు 30 వేలు మాత్రమేనని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచార నిమిత్తం ఉపయోగించే వాహనాలకు స్థానిక తహసిల్దార్ దగ్గర అనుమతి పొందాలని తెలిపారు. అనుమతి లేకుండా వినియోగించినట్లయితే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికలలో ఖర్చు చేసే ప్రచార ఖర్చులకు సంబంధించి ప్రతి పైసాను తమ ఖర్చుల ఖాతాలో చూపించాలని చెప్పారు. మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న సంగారెడ్డి, కంది కొండాపూర్ ,సదాశివపేట పటాన్చెరు, గుమ్మడిదల, హత్నూర మండలాలకు సంబంధించి డిసెంబర్ 4 న మొదటి విడత, డిసెంబర్ 6న రెండవ విడత, డిసెంబర్ 9న మూడవ విడత గా మూడుసార్లు అభ్యర్థుల ఖర్చుల లెక్కలను పరిశీలిస్తారని, ఆయా తేదీలలో సంబంధిత మండల పరిషత్ అధికారి కార్యాలయంలో ఉదయం 10 నుండి 5 గంటల మధ్య పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలనకు హాజరుకాని అభ్యర్థికి నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. నోటీసులకు సరియైన సంజాయిషీ లేనట్లయితే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఎన్నికల ఖాతా నిర్వహణ రిజిస్టర్లు సంబంధిత డాక్యుమెంట్లతో పరిశీలకుల ముందు ఆయా తేదీలలో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.



భారీగా వసూలైన ఇంటి పన్నులు

- సర్పంచ్ ఎన్నికల ఎఫెక్ట్

ప్రతిపక్షం, చిట్యాల, డిసెంబర్ 3: గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చిట్యాల మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఇంటి పనులు భారీగా వసులయ్యాయి. మొత్తం రూ. 13,97,355 లు వసూలు కాగా అత్యధికంగా... వెలిమినేడులో రూ. 2,70,575 లు, బొంగోనిచెరువు లో రూ. 1,74,525 లు, గుండ్రాంపల్లి లో రూ. 1,42,675 లు వసూలైనట్లు ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మి తెలిపారు. అతి తక్కువగా... పేరేపల్లి గ్రామంలో రూ,21,000 లు, వెంబావి లో రూ. 25,800 లు, బోయగుబ్బ లో రూ. 37,500 లు వసూలైనట్లు వివరించారు.



మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన సమావేశం

- కమిటీలు ఏర్పాటు చేయాలి

ప్రతిపక్షం, చిట్యాల, డిసెంబర్ 3: చిట్యాల పురపాలక సంఘ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకం అమలులో భాగంగా మున్సిపల్ కమీషనర్ దండు శ్రీను అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో వార్డు స్థాయిలో "బాలల పరిరక్షణ కమిటీలను" ఏర్పాటు చేసి ప్రతి నెల మొదటి శుక్రవారం రోజున కమిటి సమావేశాలు నిర్వహించాలని చెప్పడం జరిగింది. ఇందులో భాగంగా కమిటి యొక్క భాధ్యతల గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా శిశు విక్రయాలు, బాల్య వివాహాలు, అక్రమ దత్తత, బాలల పై లైంగిక వేదింపులు జరగకుండా కృషి చేయాలని సూచించారు. బాలల సమస్యలపై చర్చించి, సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాలల పై లైంగిక వేధింపులు, బాలల హక్కుల ఉల్లంఘనలు జరిగినా వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీసు వారి 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. తల్లి దండ్రులు కోల్పోయిన 18 సంవత్సరలలోపు బాలలు, దీర్ఘ కాలిక వ్యాదులతో బాధపడుతున్న తల్లిదండ్రులు కలిగిన బాలలు, దీర్ఘకాలిక వ్యాదులతో బాధపడుతున్న బాలలకు స్పాన్సర్ షిప్ ద్వారా ప్రతి నెల రూ.4,000 లు ఆర్థిక సహాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమములో ఐసీడీఎస్ సూపర్ వైజార్ ఎన్ సునీత, బాలల రక్షణ అధికారిని విద్య, రాము, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నర్సింగ్ రావు, కార్యాలయ సిబ్బంది వార్డు ఆఫీసర్లు ఏఎన్ఎమ్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్'తో సైబర్ నేరాలకు స్వస్తి

- ఆరు వారాల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 3 : 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో ఆరు వారాల పాటు నిర్వహించే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలతో సైబర్ నేరాలను నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సైబర్ నేరాలను నియంత్రించడానికి, ప్రజలలో సైబర్ భద్రతపై అవగాహన పెంచడానికి జిల్లా వ్యాప్తంగా సైబర్ జాగ్రుకత దివాస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో ఆరు వారాల ప్రత్యేక కార్యచరణను రూపొందించడం జరిగిందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మొదటి వారం సైబర్ సారథి సైబర్ హెల్ప్‌లైన్ 1930 ప్రాముఖ్యత సైబర్ మోసానికి గురైనట్లయితే గోల్డెన్ హవర్ (మొదటి గంట లోపు / వీలైనంత తొందరగా) 1930 కు కాల్ చేసి సమాచారం అందించాలి. రెండవ వారం స్కామ్ సే బచావ్ డిజిటల్ అరెస్ట్, లైంగిక బ్లాక్‌మెయిల్, సైబర్ స్లేవరీ. మూడవ వారం పైసా పైలమ్ బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్ (స్టాక్స్ బేస్డ్, టాస్క్ బేస్డ్), లోన్ ఫ్రాడ్, గిఫ్ట్ ఫర్డ్, అడ్వటైజమెంట్ ఫ్రాడ్, రివార్డ్స్ పాంయిట్ ఫ్రాడ్. నాల్గవ వారం హర్ స్కీన్ సురక్షిత్ మొబైల్, కంప్యూటర్ భద్రత: హాకింగ్, ఫేక్ యాప్, ఎపికె లింక్, బెట్టింగ్, గేమింగ్. ఐదవ వారం మేరా లాగ్ఇన్ మేరా రూల్ సురక్షిత పాస్‌వర్డ్‌లు మరియు లాగిన్ నియమాలు. ఆరవ వారం మహిళల రక్షణ పిల్లల సంరక్షణ డేటింగ్ యాప్, సైబర్ బుల్లింగ్, సైబర్ స్టాకింగ్, మాట్రిమోనియాల ఫ్రాడ్స్, చైల్డ్ సెక్సుయల్ ఫ్రాడ్. ఇలాంటి అంశాలతో ప్రజల ముందుకు వెళ్ళి, సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని ఇస్టా కళాశాలలో సైబర్ సారధి సైబర్ హెల్ప్‌లైన్ 1930 గురించి అవగాహన కల్పిస్తూ సైబర్ మోసానికి గురైనట్లయితే గోల్డెన్ హవర్ అనగా వీలైనంత తొందరగా 1930 కు కాల్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది అన్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ను వినిపించి కొత్త పద్ధతుల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనవసర లింక్ లను, ఎపికె ఫైల్స్ ఓపెన్ చేసి, ఇబ్బందులకు గురి కావొద్దని అన్నారు. బ్యాంక్ అధికారులం అని, పోలీస్ అధికారులం అని, డిజిటల్ అరెస్ట్ అని, ప్రభుత్వ శాఖల పేరుతో వచ్చే స్కామ్ కాల్స్‌కు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ సైబర్ మోసం అని గుర్తించిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కి ఫిర్యాదు చేయాలన్నారు.



కోనసీమకు తెలంగాణ ప్రజల దిష్టి తగిలిందంటూ డిప్యూటీ సీఎం పవన్ మాట్లాడటం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. పవన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. ప్రాంతీయ విద్వేషాలను నింపొద్దు. మూఢ నమ్మకాలతో ప్రజలను కించపరచడం, ప్రభుత్వ వైఫల్యాన్ని దిష్టి అంటూ రుద్దడం సరికాదు. సముద్రం నుంచి పైకొస్తున్న ఉప్పు నీళ్లతో కొబ్బరి చెట్లు కూలాయి. చిత్తశుద్ధి ఉంటే ఉప్పునీటి ముప్పను తప్పించండి.
- ఏపీపీసీసీ చీఫ్ వైఎస్‌షర్మిల

ప్రాంతీయం





దివ్యాంగులు ఆత్మస్థైర్యం తో ముందుకు వెళ్లాలి

- త్వరలో యూడీఐడీ కేంద్రం సేవలు అందుబాటులోకి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ - 3: దివ్యాంగులు ఆత్మస్థైర్యం తో ముందుకు వెళ్లాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆటల పోటీల కార్యక్రమం బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని, ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దివ్యాంగులు అందరితో పాటు చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో సెర్ప్ ఆధ్వర్యంలో త్వరలో యూడీఐడీ కేంద్రం అందుబాటులోకి రానున్నదని తెలిపారు. దానిలో పూర్తిస్థాయిలో సేవలు అందుతాయని పేర్కొన్నారు. డేకేర్ సెంటర్ సేవలు సైతం త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. రెగ్యులర్ గా శిబిరాలు నిర్వహిస్తూ అలింకో ద్వారా సహాయ ఉపకరణాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ వికలాంగుల సంఘానికి ఎస్ బీ ఐ ఆధ్వర్యంలో రూ. 8 లక్షల బ్యాంక్ లింకేజ్ రుణం పత్రాన్ని ఆ సంఘం బాధ్యులకు ఇంచార్జి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



ఎన్నికల నిబంధనలు తప్పకుండా అమలు చేయాలి

- రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు భారతి లక్పతి నాయక్

ప్రతిపక్షం, చేగుంట, డిసెంబర్ 3: రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని భారత ఎన్నికల పరిశీలకులు భారతీ లక్పతి పేర్కొన్నారు. మెదక్ జిల్లా నార్సింగి వివిధ మండలాల్లో మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఎన్నికల నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న ఎన్నికల సామాగ్రిని ఆమె పరిశీలించారు. నోటిఫికేషన్ వివరాలను ఎప్పటికప్పుడు నోటీస్ బోర్డ్ పై ఉంచాలన్నారు. జిల్లా కేంద్రానికి సకాలంలో వివరాలు అందజేయాలన్నారు. కేంద్రాల వద్ద హెల్ప్ డిస్క్ ఏర్పాటు చేయాలని భారతి వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు తాసిల్దారులు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



హోంగార్డ్ సిబ్బందికి క్రీడా పోటీలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 3: హోమ్ గార్డు రైసింగ్ డే (డిసెంబర్ 6 న) ను పురస్కరించుకొని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని గ్రౌండ్‌లో హోమ్ గార్డు సిబ్బందికి క్రీడా పోటీలను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోమ్ గార్డు సిబ్బంది జిల్లా శాంతి భద్రతల పరిరక్షణలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందించడంలో క్రీడలు విశేషంగా దోహదం చేస్తాయని తెలిపారు. ఈ క్రీడలలో భాగంగా వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న హోమ్ గార్డు సిబ్బంది ఉత్తేజంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు డిసెంబర్ 6న జరగనున్న రైసింగ్ డే పరేడ్ కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఆర్ఎస్ఐలు, హోమ్ గార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లి విద్యార్థుల సమస్య పరిష్కారం

- ఎస్ఎఫ్ఐ పోరాటానికి విజయఫలం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 3: కుకునూరుపల్లి విద్యార్థులు ఎదుర్కొంటున్న బస్సు పాస్ సమస్యను పరిష్కరించేందుకు ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ చేపట్టిన ఆందోళన, చర్యలు ఫలితాన్ని ఇచ్చాయి. కుకునూరుపల్లి నుండి సిద్దిపేటకు వచ్చే బస్సుల్లో విద్యార్థులకు బస్సు పాస్‌లను మంజూరు చేయడం లేదని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యాలయాన్ని విద్యార్థులు కలిసి సమస్యను వివరించారు. ఈ సమస్య కారణంగా పై చదువుల కోసం సిద్దిపేటకు రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ విద్యార్థులు వాపోయారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో పెట్టుకొని తక్షణమే స్పందించిన ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా నాయకత్వం, నిరంతర ప్రయత్నాలు ప్రారంభించగా, వాటికి స్పందించిన సిద్దిపేట బస్ డిపో మేనేజర్ విద్యార్థుల బస్సు పాస్ సమస్యను వెంటనే పరిష్కరించారు. అదే విధంగా, కుకునూరుపల్లి స్టాప్ నుండి సిద్దిపేటకు ప్రత్యేక ఆర్డినరీ బస్సు నడపాలని ఎస్ఎఫ్ఐ చేసిన డిమాండ్‌పై కూడా డిపో మేనేజర్ స్పందించారు. మరికొన్ని రోజులలో ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి అజ్జమర్రి మల్లేశం అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి అజ్జమర్రి మల్లేశం జెండా ఊపి 2కె రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కొరెంకల మల్లేశం, టౌన్ కార్యదర్శి సంతోష్, నాయకులు బాలనర్సు, సాయిలు, రాజు, నరేష్, ఆకాష్, సత్యం పాల్గొన్నారు. ప్రతిపక్షం, మెదక్



ఏసీబీ వలలో సర్వేయర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్/చేగుంట, డిసెంబర్ 3: ఓ రైతు తన భూమి సర్వే చేయాలని స్థానిక సర్వేయర్‌ను కలిశాడు. అయితే సర్వే చేయాలంటే డబ్బులు ఖర్చవుతాయని సదరు సర్వేయర్ ఆ రైతుకు చెప్పాడు. దీంతో ఆ రైతు ఏసీబీ అధికారులకు సమాచారం అందించి డబ్బులు డిమాండ్ చేసిన సర్వేయర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టించాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల తహసీల్దార్ కార్యాలయ సర్వేయర్ శ్రీనివాస్ భూ సర్వే కోసం రైతు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. మెదక్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం వెల్దుర్తికి చెందిన రైతు తన ఎకరం 20 గుంటల భూమి సర్వే చేయడం కోసం సంబంధిత సర్వేయర్‌ను కలిశాడు. అయితే భూమిని డిజిటల్ సర్వే చేయాలని ఇందుకోసం రూ.20 వేలు ఖర్చు అవుతుందని సర్వేయర్ సంబంధిత రైతుకు తెలియజేశాడు. దీంతో రైతు డబ్బులను బుధవారం సర్వేయర్‌కు ఇస్తుండగా రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు లంచగొండి సర్వేయర్‌ను పట్టుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో విద్యుత్ శాఖ డీఈ తో పాటు టేక్మాల్ ఎస్ఐ ఏసీబీకి చిక్కారు.

మేనేజర్ వేధింపులు భరించలేక ఉద్యోగి ఆత్మహత్య

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 3: జిల్లా కేంద్రంలోని సూపర్ మార్కెట్ విశాల్ మార్ట్ మేనేజర్ వేధింపులు భరించలేక ఓ ఉద్యోగి ప్రాణాలను తీసుకున్నాడు. నిత్యం పని ఒత్తిడి పెడుతూ వేధింపులకు గురైన ఉద్యోగి సార్ ఇలా చేస్తా నేను చస్తా అంటూ పెట్టిన మెసేజ్ కు ఐ డోంట్ కేర్ అంటూ రిప్లై ఇవ్వడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. మృతుడి కుటుంబీకుల, పోలీసుల కథనం మేరకు.. మెదక్ పట్టణం నవాబ్ పేటకు చెందిన దుర్గా ప్రసాద్(21) స్థానిక విశాల్ మార్ట్ లో కొంత కాలంగా పని చేస్తున్నాడు. ఇదే మార్ట్ కు మేనేజర్ గా పని చేస్తున్నా కిరణ్ ఉద్యోగి దుర్గా ప్రసాద్ ను కొంత కాలంగా పని ఒత్తిడి పెంచి వేధిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. పని చేయకుంటే ఉద్యోగం పోతుందన్న ఉద్దేశ్యంతో ఎంత పని భారం మోపినా దుర్గా ప్రసాద్ చేశాడు. ఈ మేనేజర్ వేధింపుల నుంచి తప్పించుకోవాలంటే ఉద్యోగం వదలాల్సిందే అనే నిర్ణయానికి వచ్చాడు. మెదక్ లో కొత్తగా ప్రారంభిస్తున్న ఓ షో రూమ్ ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఆ ఇంటర్వ్యూకు దుర్గా ప్రసాద్ వెళ్లిన విషయం తెలుసుకున్న మేనేజర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విశాల్ మార్ట్ లో పని చేస్తున్న ఒక్కరిని కూడా తీసుకోవద్దని తాను చెబుతానని మేనేజర్ చెప్పినట్లు తెలిపారు. దీంతో తనను అనేక విధాలుగా వేధిస్తున్నారు. ఇలా చేస్తే తాను ఆత్మహత్య చేసుకుంటానని దుర్గా ప్రసాద్ మేనేజర్ కు మెసేజ్ చేశాడు. ఇందుకు మేనేజర్ ఐ డోంట్ కేర్ అంటూ రిప్లై ఇవ్వడం తో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే కుటుంబీకులు మెదక్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీకి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతున్న దుర్గా ప్రసాద్ బుధవారం మృతి చెందాడు. ఈ విషయం పై మెదక్ పట్టణ సీఐ మహేష్‌ను వివరణ కోరగా దుర్గా ప్రసాద్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు విశాల్ మార్ట్ మేనేజర్ కిరణ్ పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.





వైభవంగా శివపార్వతుల కళ్యాణం

- ఉత్సవమూర్తులఊరేగింపు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 3: సిద్దిపేట లాల్ కమాన్ వైశ్య ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సిద్దిపేట సంతోష్ మాత గుడి నుంచి శివపార్వతుల మూర్తులను సుభాష్ రోడ్, మార్కెట్ చౌరస్తా, లాల్కమాన్ మీదుగా సుందర సత్సంగం వరకు ఊరేగింపు చేశారు. మహిళలు కోలాటాలతో దేవ దేవతలకు స్వాగతం పలికారు. భక్తులు భారీ సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం సుందర సత్సంగ్ భవన్లో ఏర్పాటుచేసిన కళ్యాణ వేదికపై కళ్యాణోత్సవం కన్నుల పండుగ గా జరిగింది .వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య శివనామస్మరణ తో కళ్యాణమండపం మార్మోగింది. మహిళలు పార్వతీమాతకు ఓడు బియ్యం పోసి నమస్కరించారు. లాల్ కమాన్ వైశ్య ఫ్యామిలీ క్లబ్ ప్రతినిధులు అయిత నాగరాజు, తెరాల శ్రీనివాస్ , సంతోష్, చింత రాము, బెజ గామ ఆత్మరాములు, పారిపల్లి శివ చరణ్, జూలూరి జగదీశ్వర్, అన్నపూర్ణ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ట్రెస్మా జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, డిసెంబర్ 3: ట్రెస్మా సిద్దిపేట జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. నూతన కమిటీగా అధ్యక్షుడిగా ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా గోపు ఇన్నారెడ్డి, కోశాధికారిగా తవుట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్గా కదిరే రవి, జిల్లా స్పోక్స్‌పర్సన్‌గా రేపాక భాస్కర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ట్రెస్మా తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, స్టేట్ ట్రెజరర్ పట్లోళ్ల రాఘవేందర్ రెడ్డి, ఎలక్షన్ కమిషన్ అధికారి కొమురయ్య, అలాగే పాత జిల్లా కమిటీ సభ్యులు, సిద్దిపేట జిల్లాలోని అన్ని మండలాల రెస్పాండెంట్లు హాజరయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి హాజరైన ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

దివ్యాంగులు పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలి

- డీఆర్డిఏ ఏపీడి సరస్వతి
- దివ్యాంగుల క్రీడోత్సవ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 3: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల భాగంగా శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడోత్సవాలలో విజేతలైన క్రీడాకారులకు బుధవారం మెదక్ పట్టణంలో స్టేడియంలో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్డిఏ ఏపీడి సరస్వతి, డీపీఎం వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడి సరస్వతి మాట్లాడుతూ.. పునరావాస కేంద్రంలో 283 మంది పేర్లు నమోదయ్యినా, ప్రస్తుతం 40 మంది మాత్రమే క్రమం తప్పకుండా వస్తున్నారని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్న ఫిజియోథెరపీ వల్ల పలువురు పిల్లలు నడవగలుగుతున్నారు. నాణ్యమైన విద్యను కూడా అందిస్తున్నాం అని తెలిపారు. దివ్యాంగులు పునరావాస కేంద్రాలను వినియోగించుకుని భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని ఆమె సూచించారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించే సామర్థ్యం ఉన్నందున నిస్పహాయతకు లోనవ్వకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్వాక్రా సంఘాలలో సభ్యులై వడ్డీ లేని రుణాలను పొంది స్వయం ఉపాధి కార్యకలాపాలు, చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణానికి చెందిన దివ్యాంగ యువతి వైష్ణవి “మూగ చవుడు ” నృత్యం చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. దివ్యాంగ సంఘాల నాయకులను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ, హేమ భార్గవి, మెదక్ సీడీపీఓ వెంకట రామమ్మ , భరోసా కేంద్రం న్యాయవాది శ్వేత, డీఎల్ ఎస్ఏ నాగరాజు, దివ్యాంగ సంఘాల ప్రతినిధులు, డీడబ్ల్యుఓ సిబ్బంది, డిగ్రీ కళాశాల, ఎస్ఎస్సీ విద్యార్థులు పాల్గొని సేవలు అందించారు.





హిందూ సమాజానికి సీఎం క్షమాపణ చెప్పాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, డిసెంబర్ 3: సీఎం రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సీఎం దేవుళ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర పార్టీ ఆందోళనకు పిలుపునివ్వగా బుధవారం పోలీసులు ఆయనను, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి వన్ టౌన్ కు తరలించారు. ఈ సందర్భంగా బైరి శంకర్ మాట్లాడుతూ హిందూ దేవతలను,హిందువుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా మంగళవారం జరిగిన సభలో సీఎం మాట్లాడారన్నారు. కుల రాజకీయాలు చేసే సీఎం రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని జాగ్రత్తగా మాట్లాడాలలని హితవు పలికారు. ఒక ఉన్నతమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా హిందువులంతా ఏకమై స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. పట్టణ అధ్యక్షుడు బాసం గారి వెంకట్, కాసనిగొట్టు సంతోష్, గుండ్ల జనార్దన్, తొడుపునూరి వెంకటేశం, కెమ్మసారం సంతోష్, బొడ్డు సునీల్, కొంగర పవన్ తేజ రెడ్డి, బందారం కనకరాజ్, మహేందర్ రావు, యాదన్ రావు, ఉమాపతి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐని అభివృద్ధి కోసం కాకుండా కొందరు అశ్లీలతను సృష్టించడానికి, మహిళలను లక్ష్యంగా చేసేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. ఏఐని మంచి కోసం మాత్రమే వాడుకుందాం. అసభ్యకరంగా మార్ఫింగ్ ఫొటోలు చేస్తూ ఆర్టిఫిషియల్ఇంటెలిజెన్స్ దుర్వినియోగానికి పాల్పడేవారికి కఠిన శిక్ష విధించాలి.
- హీరోయిన్ రష్మిక మందన



రాష్ట్రం సిద్ధిస్తుందనే ఆశతో శ్రీకాంత్ చారి ఆత్మార్పణం

- **నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ 'వంటేరు'**

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 3: తన ఆత్మార్పణతోనైనా కేంద్రంలో అధికారంలో ఉన్న వారి కళ్లు చెమ్మగిల్లుతాయని, తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తుందనే ఆశతో శ్రీకాంత్ ఆచారి ఆత్మార్పణకు పూనుకున్నాడని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నాడు. బుధవారం తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమ పోరాటంలో అమరుడైన శ్రీకాంత్ చారి వర్ధంతి సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ 1969 నాటి తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ ఎంతోమంది ఉద్యమకారులను తుపాకులతో కాల్చి పొట్టన పెట్టుకుందని, అంతేకాకుండా మలిదశ ఉద్యమంలో ఎంతోమంది నాయకులను పదవుల పేర్లతో వారి నోరు మూయించి తెలంగాణ అనే పదాన్ని ఉచ్చరించకుండా చేసిందన్నారు. కానీ 2001 లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు తన పదవులను గడ్డి పోచలా విసిరి, రాష్ట్ర సాధన ఎజెండాగా మార్చుకొని శాంతియుత పోరాటం ద్వారా రాష్ట్రాన్ని సాధించాలని ఆయన చూస్తే కాంగ్రెస్ కుటిల నీతితో ఎంతోమంది శ్రీకాంత్ చారి లాంటి విద్యార్థులు, పోలీస్ కిష్టయ్య లాంటి ఉద్యమకారులు కాంగ్రెస్ కుట్రకు బలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, మండల అధ్యక్షుడు బెండ మధు, మాజీ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్, పంబాల శివ, మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు స్వామి చారి, కళ్యాణ్కర్ శ్రీనివాస్, హనుమంత రెడ్డి, కూరాకుల సాయి, నరేష్ యాదవ్, ఎల్లా వెంకటేశం, ఖాసీం భాయ్, వాజిద్ , రమేష్ యాదవ్, శ్రీరామ్ మల్లేశం, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్ ను విజయవంతం చేయాలి

- **వైజ్ఞానిక ప్రదర్శనకు 17 కమిటీల ఏర్పాటు**
- **36 ప్రాజెక్టులలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు**
- **జిల్లా విద్యాధికారి విజయ వెల్లడి**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 3: మెదక్ పట్టణంలోని వెస్లీ ఉన్నత పాఠశాలలో జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 4, 5 తేదీలలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. సైన్స్ ఫెయిర్ నిర్వహణ కోసం17 కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతిక, ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, గణన ఆలోచన, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ, తదితర అంశాలపై నూతన ఆవిష్కరణలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. బీఈడీ బీఈడీ శిక్షణ విద్యార్థులు కూడా నూతన ఆవిష్కరణలతో కూడిన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించవచ్చునని పేర్కొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ ను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులను, గైడ్ టీచర్లను ఆమె కోరారు. డీఈవో వెంట జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన మూర్తి,మండల విద్యాశాఖ అధికారులు , శంకర్ ,మధుమోహన్, సత్యనారాయణ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, నాగుల్ మీరా, మల్లేశం, కమిటీ కన్వీనర్లు , కో కన్వీనర్లు మరియు సభ్యులు మరియు విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజధాని ధర్నాలో గజ్వేల్ పాత్రికేయులు

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 3 : తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 12 ఏళ్లు గడచిన వివిధ దినపత్రిక, ఛానల్లో పనిచేసే పాత్రికేయులకు ఇచ్చిన హామీలు నేటికీ ప్రభుత్వ నిర్లక్ష్య, నిరాధారణకు గురవుతున్న దానిని నిరసిస్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్, సమాచార భవనం వద్ద బుధవారం రాష్ట్ర టీయూడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షుడు విరహత్ అలీ పిలుపు మేరకు ఆయన నేతృత్వంలో జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గజ్వేల్ నుండి సీనియర్ జర్నలిస్టులైన సత్యనారాయణ, కృపాకర్, జగదీశ్వర్, మధు, సురేందర్, కృష్ణ, ఎల్లం, బాలచందర్, నర్సింలు, మహేందర్, లక్ష్మీనాచారి లతోపాటు సుమారు 30 మంది జర్నలిస్టులు తరలి వెళ్లి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్టీపీసీ లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 3: ఎన్టీపీసీ రామగుండం హ్యూమన్ రిసోర్సెస్ విభాగం (వెల్ఫేర్ సెక్షన్) ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని హాప్ కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. సమానత్వం,అన్నివర్గాల సమగ్ర అభివృద్ధి పట్ల సంస్థ చూపుతున్న కట్టుబాటును ఈ వేడుకమరోసారి వెల్లడించింది. కార్యక్రమం ముఖ్య అతిథి చందన్ కుమార్ సామంతా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ అండ్ టీ) రాకతో ప్రారంభమైంది.దీపప్రజ్వలన ఎన్టీపీసీ గీతాలాపనతో కార్యక్రమం మరింత ప్రతిష్ఠాత్మకం గా సాగింది.అనంతరం కేక్ కట్ చేశారు.పాల్గొన్నవారు తమ గురించి పరిచయం చేసుకుని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు,పరస్పర అనుబంధాన్ని బలోపేతం చేసే ఇంటరాక్టివ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాల్గొన్న వారికి వారి ఉత్సాహ సహకారాన్ని గుర్తిస్తూ సన్మానాలు కూడా అందజేశారు. కార్యక్రమంలో జీఎం (ఓ అండ్ ఎం)



మణీష్ అగర్వాల్ రామగుండం,ముకుల్ రాయ్ జీఎం(ఓ అండ్ ఎం) తెలంగాణ ముఖ్య అతిథి చందన్ కుమార్ సామంతా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రసంగిస్తూ సమగ్రతను పెంపొందించేందుకు ఎన్టీపీసీ చేస్తున్న నిరంతర కృషిని ప్రస్తావించారు పాల్గొన్నవారిని ప్రేరేపించారు.

కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలి

- **సింగరేణి యాజమన్యం ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**
- **రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి**



ప్రతిపక్షం బ్యూరో, మంచిర్యాల, డిసెంబర్3: సింగరేనిలో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించి తమ ప్రభుత్వం కూడ దృష్టి సారించిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి జి. వివేక్వెంకటస్వామి తెలిపారు. బుధవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీ విస్తరణతో ఏరియాకు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఓసీ విస్తరించే ప్రాంతాల్లో ప్రజల డిమాండ్లను కూడ యాజమాన్యం పరిష్కరించాలన్నారు. చెన్నూర్ లో ఎన్నికల ముందు తాము చెప్పినట్లు 40వేల ఉద్యోగాలకు సంబంధించి తాను ఒక ప్రణాళికతోనే పని చేస్తున్నారన్నారు. త్వరలోనే జైపూర్ పవర్ప్లాంట్ లో ప్లాంట్ విస్తరణ పనులు కూడా చేపట్టనున్నామన్నారు. దీని ద్వారా చాలా మంది ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అంతేగాకుండా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని సంబంధించి అభివృద్ధి పనులను కూడా పెద్ద ఎత్తున చేపడుతున్నామని తెలిపారు. అటు పవర్ ప్లాంట్ లో కూడా త్వరలోనే పరిసర ప్రాంతంలో విద్య, వైద్యానికి సంబంధించి కూడ దృష్టి పెట్టామన్నారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాకులకు సంబంధించి ఒరిస్సా తరహాలోనే వేలం పాటలో దక్కించుకోవాలని కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల సాధికారతకు

ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 3: వికలాంగుల సాధికారతను ప్రోత్సహిస్తూ సమాజ నిర్మాణం కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంను పురస్కరించుకొని తంగళ్లపల్లి మండలంలోని భవిత కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, పి.లక్ష్మణాచారి సమన్వయంతో ఈ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వికలాంగుల హక్కులు, ప్రభుత్వ పథకాలు, న్యాయ సహాయం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం భవిత కేంద్రంలోని చిన్నారులకు పండ్లు మరియు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సదస్సులో తంగళ్లపల్లి ప్రైమరీ పాఠశాల హెడ్ మాస్టర్ వెంకటేశ్వర స్వామి, భవిత కేంద్రం ఐ.ఈ.ఆర్పి. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలభద్రత కోసం మఫ్టీలో షీటీమ్స్ నిఘా

- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 3: మహిళలు,యువతుల రక్షణ కోసమే షీటీం ఉందని, మహిళల రక్షణ, భద్రత పోలీసు బాధ్యత లో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో షీ టీమ్స్ స్కూల్, కళాశాలలు, ఆఫీస్ లు ముగిసే సమయానికి స్కూల్స్, కళాశాల, బస్టాండ్ ప్రధాన కూడళ్ళ వద్ద ఎక్కువగా బాలికలు, మహిళలు ప్రయాణాలు చేసే సమయంలో వారిని ఏవైనా ఇబ్బందులు పెడుతున్నారా అని క్షేత్ర స్థాయిలో ప్రజల మధ్య సాధారణ జనాల వలె మఫ్టీ లో ఉంటూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని, కమిషనరేట్ పరిధిలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో కేసు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యవచ్చినప్పుడు 100కు డయల్ చేస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. టీ సేఫ్ యాప్, మహిళల భద్రత, రక్షణ చర్యలు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్య పరుస్తున్నామని వివరించారు. షీటీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, లేదా ఆన్లైన్ క్యూఆర్ కోడ్,వాట్సాప్ ద్వారా కూడా స్వీకరిస్తామన్నారు. ఎవరైనా వేధింపులు,అసభ్య ప్రవర్తన,మాట్లాడడం వంటి సమస్యలు ఎదురైతే వెంటనే ధైర్యంగా పోలీసులకు తెలియ జేయాలని సూచించారు. బాలికలు,మహిళలు ఎక్కడ ఉన్నా భద్రతగా ఉండటం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత.పోలీసుశాఖ మీకు అండగా ఉంటుంది.మీ భద్రత కోసం 24 గంటలు సిద్ధంగా ఉన్నాం ,తప్పు చేస్తున్న వారి మీద చర్య తీసుకోవడానికి మీ సమాచారమే వారిపై చట్టపరమైన చర్యలకు ఆధారం అన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల లో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303923700,పెద్దపల్లి జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి కాల్ చేసి, వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సీపీ సూచించారు.



ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ -3: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం, ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ ను ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. తంగళ్ళపల్లి ఎంపీడీఓ కార్యాలయం, అలాగే జిల్లెల వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు



సింగరేణి ఫారెస్ట్ డెవలప్మెంట్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఏర్పాటు

- **గౌరవ అధ్యక్షునిగా ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్**
- **అధ్యక్షుడిగా సుంకర విజయ కుమార్**


ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 3: సింగరేణి ఫారెస్ట్ డెవలప్మెంట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కాంట్రాక్టర్ల సమావేశం బుధవారం గోదావరిఖని దుర్గా నగర్ లో నిర్వహించారు. గత కొన్ని రోజులుగా సింగరేణి ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కొరకు సింగరేణి వ్యాప్తంగా ఫారెస్ట్ టెండర్లు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్స్ అందరూ కలిసి "సింగరేణి ఫారెస్ట్ డెవలప్మెంట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్"రిజిస్ట్రేషన్ నెంబర్ 762/ 2025 పేరుతో నూతన యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ "గౌరవ అధ్యక్షునిగా" రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన సింగ్ "ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా యూనియన్ అధ్యక్షునిగా సుంకర విజయ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాదినేని సదానందం, ఉపాధ్యక్షు లుగా మారుతి శ్రీనివాసరావు, గుడి నారాయణ రెడ్డి, అన్నం రమేష్ కోశాధికారిగా, పిట్టల శివకృష్ణ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఎస్.కె జాన్ ఖాన్ సెక్రటరీగా,ఏ.ప్రభాకర్ రెడ్డి, ఎం.శ్రీనివాస్,వి.రమేష్ రావు జాయింట్ సెక్రటరీగా,వి. అంజయ్య,కళాధర్ రెడ్డి,ఎం.సుధాకర్,ఎస్ రాజయ్య, యూనియన్ సలహాదారుడిగా వంగ వీరస్వామి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలో ఉన్న ఫారెస్ట్ కాంట్రాక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డిజిటల్ ప్రపంచంలో ప్రతి విద్యార్థి సైబర్ సారథి కావాలి

- **ఎస్ఐ రమేష్, అనూష**



ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 3: 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో 6 వారాల రాష్ట్రవ్యాప్త సైబర్ భద్రత ప్రచార కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో సైబర్ అవగాహన పెంపునకు బుధవారం గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు రమేష్, అనూష విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోదావరిఖని కృష్ణ వేణి వికాస్ జూనియర్ కళాశాల, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల శారదా నగర్, ఇండో అమెరికాన్ స్కూల్ లలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సైబర్ నేరాలు, భద్రతా చట్టాలు, డిజిటల్ హైజీన్పై అవగాహన కల్పించేందుకు సైబర్ సారథి'పేరుతో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్, అనూష విద్యార్థులతో మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణకు ఉపయోగపడే తాజా సాంకేతిక పద్ధతులు,ఎఐ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) వినియోగం గురించి, ఆన్లైన్ ఫ్రాడ్స్, ఫైనాన్షియల్ స్కామ్లు, ఫోన్/యాప్ ద్వారా మోసాలు జరిగినప్పుడు వెంటనే 1930 నంబర్కు కాల్ చేయాలని, ఇది దేశవ్యాప్తంగా పనిచేసే అత్యవసర హెల్ప్లైన్ అని విద్యార్థులకు తెలియజేశారు. ఏదైనా సందర్భంలో సైబర్ నేరగాళ్ళ చేతిలో బాధితులు మోసపోయినప్పుడు గోల్డెన్ అవర్లో ఇచ్చే కంప్లైంట్ వల్ల డబ్బులు ట్రాక్ చేసి నిలిపివేయడం చాలా వేగంగా సాధ్యమవుతుందని గోల్డెన్ అవర్ రిపోర్టింగ్' ప్రాముఖ్యత గురించి సైబర్ మోసాలు జరిగిన వెంటనే మొదటి 1 గంట సమయం అత్యంత కీలకం అని తక్షణం కంప్లైంట్ ఇవ్వడం వల్ల లాస్ రికవరీ అవడానికి అవకాశం ఎక్కువని అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ వారియర్ సిబ్బంది, బ్లూ క్లోట్స్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్, టీచర్స్, పాల్గొన్నారు.



వ్యవసాయోత్పత్తులు గ్లోబల్ బ్రాండ్గా మారాలి. ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లు పెట్టుకోవాలి. ఫ్యాక్టరీలు, మార్కెట్తో అనుసంధానమవ్వాలి. ఏ పంటలతో ఆదాయమొస్తుంది? ఏ కాంబినేషన్ పంటలు వేయాలి? పరిశ్రమలకు అనుసంధానం ఎలా చేయాలి? రైతులే పరిశ్రమలు ఎలా పెట్టాలన్న అంశాలపై ప్రభుత్వం సహకరిస్తుంది.

- 'రైతన్నా.. మీకోసం' లో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి
- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలో కలెక్టర్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 3: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాలలో అద్వితీయ విజయాలను సాధించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఉద్బోధించారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా రంగాల్లో దివ్యాంగులు ప్రదర్శిస్తున్న ప్రతిభా పాటవాలను గుర్తు చేస్తూ వారిని కొనియాడారు. విద్యా, రాజకీయ రంగాలతో పాటు క్రీడలు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు ఇలా ఏ రంగంలో చూసినా దివ్యాంగులు సమాజంలోని సకలాంగులకు ఎంతమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని, దివ్యాంగులను వివాహం చేసుకున్న వారికి లక్ష రూపాయల ప్రోత్సాహకం అందిస్తోందని గుర్తు చేశారు. అలాగే, స్వయం ఉపాధి కోసం ముందుకు వచ్చే వారికి తక్షణ ఆర్థిక సాయం అందేలా చొరవ చూపుతోందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఉద్దేశించిన భవిత కేంద్రాలను జిల్లాలో అన్ని వసతులతో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. భవిత కేంద్రాలతో పాటు నిజామాబాద్ నగరంలో దివ్యాంగుల కోసం ఉద్దేశించిన వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రెడ్ క్రాస్, జిల్లా యంత్రాంగంల ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల కోసం నిర్వహించబడుతున్న వృద్ధాశ్రమాన్ని కూడా అవసరం ఉన్న వారు వినియోగించుకునేలా చూడాలన్నారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని, సదరం సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు ఉంటే తొలగిస్తామని, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన సమయాలలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ తెలిపారు. సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగులకు సముచిత ప్రాధాన్యత దక్కేలా జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. దివ్యాంగులకు ఉద్దేశించిన పథకాలు, వారి హక్కుల గురించి విరివిగా ప్రచారం చేసేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలపించిన గేయాలు ఆహుతులను అలరింపజేశాయి. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నగరంలోని దివ్యాంగుల సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో రూ.12.5 లక్షల విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమూర్తి, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, మమత, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.



నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 3: మూడవ విడత నామినేషన్ ల స్వీకరణ సందర్భంగా తాడ్వాయి మండలం కన్కల్ గ్రామ పంచాయితీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. తాడ్వాయి మండలంలోని కన్కల్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సందర్శించారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ నిబంధనల కనుగుణంగా చేపట్టాలని,సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయని అడిగి తెలుసుకొని, రెండవ విడత నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) , విత్ డ్రావెల్ జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా మూడవ విడత నామినేషన్ లో చివరి రోజు ఎక్కువ వేసే అవకాశం ఉన్నందున అధికారులు ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించి రోజూ వారిగా నామినేషన్ లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని, చివరి రోజు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆన్నారు.కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్వేత, ఎంపిడిఓ సయ్యద్ సాజిద్ అలీ, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు. కామారెడ్డి లో స్థానిక సంస్థల ఎన్నికల మొదటి దశ నామినేషన్ ప్రక్రియ నవంబర్ 27, 2025 న ప్రారంభమై 29 నవంబర్ 2025 న విజయవంతంగా ముగిసిందని మొదటి విడతలో మొత్తం 10 మండలాల్లో విస్తృతంగా నామినేషన్ దాఖలు అయ్యాయని, 1520 వార్డులకు మొత్తం 3833 నామినేషన్లు దాఖలయ్యాయి. 167 సర్పంచ్ స్థానాలకు 1224 మంది అభ్యర్థులు నామినేషన్ లు వేయడం జరిగింది. ఎన్నికల ప్రకారం, పోలింగ్ , లెక్కింపు ప్రక్రియ డిసెంబర్ 11, 2025 న జరగనుంది.



రేవంత్ వ్యాఖ్యలు హిందువుల పై ప్రత్యక్ష దాడి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 3 : హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిజామాబాద్ నగరం లోని నిఖిల్ సాయి చౌరస్తా లో నల్ల బ్యాడ్జి లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ ఇటివల సీఎం సీఎం హిందూ దేవి దేవతలను అవమానించేలా చేసిన వ్యాఖ్యలు క్షమించలేనివని అన్నారు. గతంలో కేసీఆర్ హిందూ గాళ్ళు బొందుగాళ్ళు అంటే పాతలానికి పాతేశారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికు కాంగ్రెస్ పార్టీ కి కూడా అదే దుస్థితి పడుతుంది అన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం హిందూ భావాలను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే, బీజేపీ జిల్లా వ్యాప్తంగా పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మి నారాయణ, నాగోల్ల లక్ష్మి నారాయణ, ఆకుల శ్రీనివాస్, బూరుగుల వినోద్, ఇప్పకాయల కిషోర్,మల్లేష్ గుప్తా, గడ్డం రాజు, అంబదాస్ రావు, నారాయణ యాదవ్, గిరిబాబు, యాదల నరేష్, ఆమందు విజయ్ కృష్ణ,ఆనంద్, చిరంజీవి బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 3: తాడ్వాయి మండలం కరడ్ పల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కొనుగోలు కేంద్రంలో వరి కొనుగోలు ప్రక్రియ, రైతుల రాకపోకలు, గన్నీస్ అందుబాటు, రవాణా సదుపాయాలు తదితర అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం వరి కొనుగోళ్లు ఖరీఫ్ లో ఈ సంవత్సరం ఖరీఫ్ 2025-26 వివరాలు సాగు చేసిన విస్తీర్ణం: 506 ఎకరాలలో రైతుల సంఖ్య: 421 మంది ఆశించిన ఉత్పత్తి: 12,650 క్వింటాళ్లు ఇందులో హార్వెస్టింగ్: 90% పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్లు నేటి వరకు, మొత్తం కొనుగోలు: 604.00 క్వింటాళ్లు మిల్లులకు మార్చబడినవి: 310.40 క్వింటాళ్లు పంపిన ట్రక్కులు: 1, దిగిన ట్రక్కులు: 1 స్థానిక APP ప్రకారం గ్రౌండ్ బ్యాలెన్స్: 293.60 క్వింటాళ్లు ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన కొనుగోలు: 310.40 క్వింటాళ్లు (52%) PPC కు మొత్తం కేటాయింపు: 3000 క్వింటాళ్లు రైస్ మిల్లులకు పంపిణీ చేశారని తెలిపారు. రవాణా కాంట్రాక్టర్ ద్వారా లోడింగ్ సక్రమంగా జరుగుతున్నదని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రంలో నిర్వహణ పద్ధతులను పరిశీలిస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణం, పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తూకం, గన్నీస్ సరఫరా, ట్రక్కుల రాకపోకలు, మిల్లులకు రవాణా వంటి అంశాల్లో పూర్తి సమన్వయం ఉండాలని సూచించారు. త్వరితగతిన కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని ఆన్నారు. అనంతరం ప్రజలు గ్రామం లో ఉన్న సమస్యలను జిల్లా పరిషత్ పాఠశాల సమీపం లో ఉన్న డంపింగ్ యార్డ్ ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అలాగే పాఠశాలలో త్రాగునీరు, టాయిలెట్స్ సమస్యల పై కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే తహసిల్దార్, సంబంధిత అధికారులకు ఆదేశాలు చేస్తూ ఇక్కడే ఉండి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు .



చోరికి గురైన 170 మొబైల్ ఫోన్ల అప్పగింత

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 3: నిజామాబాద్ డివిజన్ పరిధిలో ఈ మధ్య కాలంలో పోగొట్టుకున్న, చోరికి గురైన 170 మొబైల్ ఫోన్లను (సుమారు రూ.17 లక్షల విలువగల) బాధితులకు అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి నిజామాబాద్, డివిజన్ గత కొన్ని రోజుల నుండి పోయిన, చోరీకి గురైన సుమారు 17 లక్షల రూ. విలువ గల 170 ఫోన్ల ఆచూకీ మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి రికవరీ చేసి బుధవారం సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేని, మన విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్ , పాస్ వర్డ్స్ వంటివి మొబైలో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన నేరగాళ్లు మొబైల్ దొంగిలించి , వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల (https://www.ceir.gov.in) నందు బ్లాక్ చేసి , సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసినట్లైతే అట్టి షాప్ యజమాని నుండి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్ లను మొబైల్ షాప్ లలో అమ్ముతున్నారని, తక్కువ ధరకు వస్తుందని దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురి అవుతున్నారని అన్నారు. ఎవరైన దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లైతే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.



జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీపీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 3: జిల్లాలోని జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ ను బుధవారం పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహణకు అన్ని ముందస్తూ ఏర్పాట్లు చేయాలని, పాత నేరస్తులను గుర్తించి బైండోవర్ చేయాలని స్టేషన్ ఎస్ఐ సిబ్బందికి సూచించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ను సిబ్బంది స్వయంగా పరిశీలించి కనీస వసతులు కల్పించేవిధంగా చూడాలని, పోలీస్ స్టేషన్ రికార్డులు, బ్యారక్లు, అండర్ ఇన్వేస్టిగేషన్ కేసులపై విపులంగా తనిఖీలు చేసి ప్రతీ కేసుకి ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏర్పాటు చేసి నాన్యమైన ధర్యాప్తు చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ అవగాహణ పాఠశాలలు కళాశాలలలో సోషల్ మీడియా ద్వారా అవగాహణ నిర్వహించాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు ప్రజలతో మమేకమై గ్రామ సమస్యలు తీర్చేవిధంగా పనిచేయాలని, సరిహద్దు ప్రాంతాల్లో పరస్పర సమన్వయం బలపర్చుకోవాలని తెలిపారు.



జర్నలిస్టుల డిమాండ్లు పరిష్కరించపోతే ఆందోళనలు తప్పవు!

- టీయూడబ్ల్యూజే పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు ఎం.వంశీ

ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 3: జర్నలిస్టుల డిమాండ్లు పరిష్కరించపోతే ఆందోళనలు తప్పవని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు)అనుబంధ తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు ఎం.వంశీ అన్నారు.జర్నలిస్టులు తమ హక్కుల సాధనకై బుధవారం హైదరాబాద్ లోని సమాచార, పౌర సంబంధాల కార్యాలయం ముందు టియు డబ్ల్యూ జె ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నా లో వేలాది మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.జిల్లా శాఖ నుంచి కూడా జర్నలిస్టులు భారీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారించకుండా నాడు పదేళ్ల కాలం టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, నేడు రెండేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.గుర్తింపు కార్డులు,హెల్త్ కార్డులతోపాటు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లాస్థలాలు మంజూరు చేయాలని,వృత్తి కమిటీలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల కోసం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తే,ఇప్పటికి సానుకూలం గా స్పందించకపోవడంతోనే మహాధర్నా నిర్వహించాల్సి వచ్చిందన్నారు.ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం,జర్నలిస్టులకు హెల్త్ కార్డులను మంజూరు చేయక పోవడం బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో ఐజేయూ నాయకులు పాలకుర్తి విజయ్ కుమార్ తోపాటు యూనియన్ జిల్లా నాయకులు పి.శ్యామ్ సుందర్,జక్కం సత్యనారాయణ, గోలి సమ్మిరెడ్డి,కే.ఎస్.వాసు, మనోహర్ రెడ్డి,బైరం సతీష్, డబ్బేట శంకర్, సుధీర్ బాబు, మామిడి సత్యనారాయణ,కృష్ణ, మెండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలి


- గుత్పలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 3 : ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మాక్లూర్ మండలం గుత్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ఫారంలు, రిజిస్టర్లను పరిశీలించారు. మొదటి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు వచ్చిన నామినేషన్ల వివరాలను వెంటవెంటనే రోజు వారీగా ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ లు బుధవారం పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిపించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్, అవి నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ధన్వాల్, సిబ్బంది సాత్విక్, విజేందర్ తదితరులు ఉన్నారు.



పార్లమెంటులో కుల గణనపై నేనో ప్రశ్న అడిగా. దానికి కేంద్రం ఇచ్చిన సమాధానం విని షాకయ్యాను. సరైన ఫ్రేమ్ వర్క్ లేదు, టైమ్ బౌండ్ ప్లాన్ లేదు, పార్లమెంట్‌లో చర్చించలేదు, ప్రజలను సంప్రదించలేదు. కులగణనను విజయవంతంగా చేసిన రాష్ట్రాల నుంచి నేర్చుకోవాలని లేదు. క్యాస్ట్ సెన్సస్‌పై మోదీ ప్రభుత్వ తీరు దేశంలోని బహుజనులను దగా చేసేలా ఉంది.

- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ

ప్రాంతీయం



ఓటు చోరీకి పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వం

- **డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 3: ఇటీవల బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో బీజేపీ ఓటు చోరీ చేసింది కాబట్టి ఆ రాష్టంలో అధికారంలోకి వచ్చిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం డిచ్ పల్లి లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా స్వామ్యానికి వ్యతిరేకంగా నియంత్రత్వ దొరనితో ముందుకు వెళ్తూ రాష్టాలలో అధికారంలోకి వస్తున్నాయని అన్నారు. బ్రెజిల్ దేశానికి చెందిన ఒక నటికి సంబంధించి దాదాపు 22 ఓట్లు ఉన్నాయాని ఆమె మన దేశ పౌరురాలు కానప్పటికి నకిలీ ఓట్లు సృష్టించి ఆ రాష్టంలో అధికారంలోకి వచ్చిందన్నారు. హర్యానలో దాదాపు 25లక్షల ఓట్లు 12.5 శాతం నకిలీ ఓట్లు పోలయ్యాయి వాటితోనే బీజేపీ పార్టీ గెలిచిందన్నారు. ఎలక్షన్ కమీషన్, కేంద్ర ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకాలు అని మండిపడ్డారు. త్వరలో జరగబోయే తమిళనాడు, వెస్ట్ బెంగాల్ లో కూడా అదే విధంగా గెలవాలని చూస్తున్నారని, దీనిపై తమ నాయకుడు రాహుల్ గాంధి యువత లో మార్పు తెచ్చే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. మన రాష్ట్రములో జరుగుతున్న సర్పంచ్ ఎలక్షన్స్ లో ప్రజలు స్వచ్ఛందగా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటారని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి విక్కీ యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు యాదగిరి, డిచ్ పల్లి మాజీ ఎంపీపీ నర్సయ్య, కంచెట్టి గంగాధర్, నిజామాబాదు రూరల్ అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు ధాన్యంలో తరుగును తీయకూడదు

- **జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలు**



ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 3: రైతులు విక్రయించిన ధాన్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తరుగును తీయకుండా రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కస్టమ్ మిల్లింగ్ రైస్ (CMR), ధాన్యం కొనుగోలు అంశాలపై పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన సమయంలో, రైస్ మిల్లర్లు ధాన్యపు బస్తాలపై అధికంగా తరుగును తీస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని రైతులు ఆమె దృష్టికి తీసుకురావడంతో, ఈ అంశంపై ప్రత్యేకంగా సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని అనుసరించి నిర్దేశిత సీఎంఆర్ లక్ష్యాన్ని మిల్లర్లు వేగవంతంగా పూర్తి చేయాలని, ధాన్యం మిల్లర్లకు చేరిన వెంటనే ఆన్‌లైన్‌లో అక్నాలెడ్జ్మెంట్ ఇవ్వాలని, సన్న, దొడ్డు రకాల తేడా లేకుండా ధాన్యం దింపుకోవాలని, రైతులను తరుగుతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, జిల్లాలో ఏ మిల్లుకు ఎంత ధాన్యం కేటాయించారన్న పూర్తి వివరాల జాబితాను మిల్లర్లకు అందజేయాలని, ధాన్యం కేటాయింపు పూర్తిగా పారదర్శకంగా జరగాలని అధికారులకు సూచించారు. ఏయే కొనుగోలు కేంద్రాలు ఏయే మిల్లులకు అలాట్ అయ్యాయనే విషయాలను కూడా మిల్లర్లకు ముందుగానే తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎండి. వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, తదితర అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మత్తు పనులు పకడ్బందీగా చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, డిసెంబర్ 3 : నిర్మల్ పట్టణంలో చేపట్టిన రోడ్ల మరమ్మత్తుల పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్, అంబేద్కర్ చౌక్ సమీపంలో కొనసాగుతున్న రోడ్డు మరమ్మత్తుల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులను సకాలంలో గా పూర్తి చేయాలని అన్నారు. గుంతల రోడ్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని వివరించారు. మరమ్మత్తుల పనులన్నింటినీ నాణ్యవంతంగా చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. వర్షాకాలం రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ఫుట్ పాత్ కు మరమ్మత్తులు చేయాలని తెలిపారు. పట్టణంలో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి నిర్మాణం పూర్తయిన మినీ ట్యాంక్ బండ్ పార్కును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి హరిభువన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పాల్ద గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 3 : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని నిజామాబాద్ మండలం పాల్దా గ్రామ సర్పంచి అభ్యర్థిగా ప్రభాకర్ ఒక్కరే నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ కాంగ్రెస్, బీజేపీ మద్దతు దారులు ఏ ఒక్కరు కూడా సర్పంచి బరిలో నిలబడక పోవడం గమనార్హం. కాగా ప్రభాకర్ ను బీఆర్ఎస్ బలపర్చినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభాకర్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఈయన ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఇక అధికారికంగా ప్రకటించడమే మిగిలి ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పట్టు ఉన్న ఈ గ్రామంలో సర్పంచ్ ఏకగ్రీవం చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. అధికార పార్టీకి అసలు ఎవరూ అభ్యర్థులే దొరకలేదా బరిలో నిలిచేందుకు బీజేపీ నేతలు ఆసక్తి చూపలేదా అనే చర్చకు దారితీసింది. మరోవైపు ఇదే గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బలపర్చిన అభ్యర్థులు హోరా హోరీగా నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం. సర్పంచి స్థానానికి మాత్రం అభ్యర్థులు దూరంగా ఉండటం విశేషం.

విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులువు

- **ఆన్‌లైన్ పేమెంట్ కియోస్క్ ప్రారంభించిన టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 3: అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యుత్ వినియోగదారుల ముంగిటకు తీసుకువచ్చామనే సంకల్పంతో టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థ ముందుకు సాగుతోందని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. బుధవారం హన్మకొండ నక్కలగుట్టలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పేమెంట్ సిస్టమ్ (కియోస్క్) ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యుత్ సేవలను పూర్తిగా డిజిటల్ వైపుకు మళ్లిస్తూ వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ సహకారంతో ఈ ఆన్‌లైన్ పేమెంట్ కియోస్క్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని ఈఆర్వో కేంద్రాల్లో కూడా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వచ్చే వినియోగదారులు ఇక్కడ ఏర్పాటు చేసిన కియోస్క్ ద్వారా అతి తక్కువ సమయంలో తమ బిల్లులను చెల్లించగలుగుతారని తెలిపారు. కియోస్క్‌లో ఉన్న సంబంధిత విద్యుత్ బిల్లుపై ఉన్న యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేస్తే వినియోగదారుల వివరాలు కనిపిస్తాయని, అనంతరం పేమెంట్ ఆప్షన్‌కు వెళ్లగానే క్యూఆర్ కోడ్ వస్తుందని, దీనిని మొబైల్‌లోని యూపీఐ యాప్ ద్వారా స్కాన్ చేసి సులభంగా బిల్లు చెల్లించవచ్చని వివరించారు. ఇది అత్యంత సులభమైన, సౌకర్యవంతమైన విధానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీ వి. తిరుపతి రెడ్డి, సీజీఎం ఆర్. చరణ్ దాస్, సీఈ శ్రవణ్ కుమార్, జీఎం శ్రీనివాస్, వెంకట కృష్ణ, హన్మకొండ ఎస్ఈ మధుసూదన్ రావు, ఎస్ఏఓ నవీన్ కుమార్, డీఈ (టెక్నికల్) విజయేందర్ రెడ్డి, హన్మకొండ టౌన్ డీఈ సాంబ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఏజీఎంలు వై. శ్రీకాంత్ కుమార్, మహేష్, చీఫ్ మేనేజర్ పి.వి. చైతన్య రెడ్డి తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎస్సీ ఎస్టీ అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించండి

- **డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్**

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబరు 3: రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ అత్యాచార బాధితులకు చెల్లించాల్సిన 37 కోట్ల పెండిగ్ నిధులను విడుదల చేసి బాధితులకు అందజేయాలని ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు ఆశాలత, మీరా సంఘమిత్ర, పి.శంకర్ డిమాండ్ చేశారు. బుధవారంనాడు డీబీఎఫ్ అధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా లోని ఎస్సీ ఎస్టీ అత్యాచార బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడతు రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మంది బాధితులకు చెల్లించాల్సిన 37 కోట్ల నిధులను విడుదల చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం ముఖ్యమంత్రి అధ్యక్షతన హైపవర్ కమిటి ఏర్పాటు చేసి సంవత్సరంలో రెండు సార్లు ముఖ్యమంత్రి సమీక్షించాలని డిమాండ్ చేశారు. చట్టం అమలుకు ఐక్య ఉద్యమం చెపట్టాలన్నారు. మహిళ రైతుల హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఆశలత మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ల మానవ హక్కుల ఉల్లంఘన లు పెరిగిపోతున్నాయన్నారు. జాతీయ ప్రజా ఉద్యమాల వేదిక జాతీయ నాయకులు మీరా సంఘమిత్ర మాట్లాడుతూ పొరాడి సాధించుకున్న దేశ వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ చట్టం అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం, వివక్ష పాటించడం తగదన్నారు. సమావేశం అనంతరం బాధితులు వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్డరేట్ లో బాధితులకు నష్ఠపరిహరం చెల్లించాలని వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమం లో డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, రాష్ట్ర నాయకురాలు బొర్ర సంపూర్ణ, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు పాల రవికుమార్, మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు అద్దునూరి యాదగిరి, బాధితులు పాల్గొని వారి సమస్యలను వివరించారు.



పెరిక కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవం

ప్రతిపక్షం, వెంకటాపురం, డిసెంబర్ 3: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించిన పెరిక కుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో వెంకటాపురం వాసి పల్నాటి నాగేశ్వరరావు జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంఘ బలోపేతం, పేద పెరిక కుటుంబాల సమస్యల పరిష్కారానికి నాగేశ్వరరావు చేసిన కృషిని గుర్తించిన మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు ఆయన పేరును ఒకే మాటగా ఆమోదించారు. భారీగా సభ్యులు పాల్గొన్న ఈ సమావేశం పెరికల ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.



దివ్యాంగులను ఆదరిద్దాం

ప్రతిపక్షం, సోన్, డిసెంబర్ 3: దివ్యాంగులను సమాజం ఆదరించాలని, వారిని ఎప్పుడు కూడా చిన్నచూపు చూడొద్దనీ, వారిలోని శక్తియుక్తులను, సృజనాత్మకతలను సమాజం వాడుకోవాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక విలీన భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం ద్వారా లభించనున్న వివిధ రకాల పథకాలను అవకాశాలను రిజర్వేషన్లను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పిల్లలకు వివిధ పాటల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఎం పి ఓ జ్యోతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి, విలీన భవిత కేంద్రం ఇన్స్పెక్టర్ సంధ్య రాణి పోషకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మైక్రో అబ్జర్వర్లు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- **ఎన్నికల సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం**



ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, డిసెంబర్ 3 : సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) తమ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నిక విధుల్లో పాల్గొనబోయే సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ అయేషా మస్రత్ ఖానం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహించబోయే అధికారులకు ముందుగానే సమాచారం అందించామని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని వినియోగించుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. శిక్షకులు అందించిన సమాచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని వివరించారు.

పంచాయితీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం: కలెక్టర్ అభిలాష అభినవ్

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా, ఎన్నికకు ముందు, ఎన్నిక సమయంలో, ఎన్నిక తర్వాత, ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమయానుసారం ఓటింగ్ నమోదు వివరాలను పైఅధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. మైక్రో అబ్జర్వర్లకు అందించిన కరదీపికలను అనుసరించాలని చెప్పారు. ఎటువంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండో దశలో భాగంగా మరోసారి సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్దేశించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. పలువురు శిక్షకులు మైక్రో అబ్జర్వర్లకు తమ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రైతు రత్న అవార్డు అందుకున్న ఆదర్శ రైతు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, డిసెంబర్ 3 : కన్హ శాంతి వనం నందిగామ రంగారెడ్డి జిల్లా లో మహా కిసాన్ మేళా సందర్భంగా రాష్ట్రం లోని పలు జిల్లా లలో వివిధ పద్ధతులలో ఆదర్శంగా సాగు చేస్తున్న రైతులకు రైతు రత్న అవార్డు తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం ద్వారా ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా తల్వేద గ్రామానికి చెందిన కోమటి భూచన్న కి ప్రకృతి వ్యవసాయం మరియు దేశీయ వరి వంగడాలను భద్ర పరచడం ,విస్తరించడము వలన వారికి గౌరవ వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతు రత్న అవార్డు ఇచ్చి సత్కరించడం జరిగింది.

“



తెలంగాణలో అభివృద్ధి పనులకు సహకరించాలని పీఎం మోదీని కోరాం. మీరు సీఎంగా ఉన్నప్పుడు నాటి పీఎం మన్మోహన్ సింగ్ గుజరాత్ అభివృద్ధికి సహకరించారు. అలాగే మీరు కూడా టీజీ అభివృద్ధికి సహకరించండని కోరాము. నిన్న తమ పార్టీలో భిన్న రకాల మనస్తత్వాలను వివరించే ప్రయత్నంలో చేసిన కామెంట్లను బీజేపీ నేతలు అనవసర వివాదం చేస్తున్నారు.
- సీఎం రేవంత్ రెడ్డి

మోడీ సర్కారు బహుజనులకు ద్రోహం చేస్తోంది

- లోక్ సభలో మండిపడిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో,న్యూఢిల్లీ, డిసెంబర్ 3: కేంద్ర ప్రభుత్వం దేశంలోని బహుజనులకు బహిరంగంగానే ద్రోహం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంటులో విపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక, నిర్దిష్ట కాలపరిమితి, పార్లమెంట్ లో చర్చ, ప్రజల అభిప్రాయం లేకుండానే కులగణన సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారని ఆయన విమర్శించారు. జనగణనకు సంబంధించి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్న అడిగితే, వారిచ్చిన సమాధానం దిగ్భ్రాంతికరంగా ఉందన్నారు. కనీసం కులగణన సర్వే విజయవంతంగా నిర్వహించిన రాష్ట్రాల నుంచి వివరాలు అడిగి కూడా తెలుసుకోలేదన్నారు. ఈ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశంలోని బహుజనులకు బహిరంగంగ ద్రోహమేనని రాహుల్ మండిపడ్డారు. జనగణన వివరాలు, కాల వ్యవధి, ప్రశ్నావళి సహా నిబంధనలు చెప్పాలంటూ రాహుల్ గాంధీ లోక్ సభలో కేంద్రాన్ని ప్రశ్నించారు. ముసాయిదా ప్రశ్నలు ప్రచురించి, ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి సలహాలు అడిగే ప్రతిపాదన ఉందా! చెప్పాలన్నారు. వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన సర్వేల నుంచి సూచనలు తీసుకుంటారా? అని కూడా ప్రశ్నించారు. ఈ క్రమంలోనే స్పందించిన కేంద్రం, దేశంలో జనగణన రెండు దశలలో నిర్వహించనున్నామని వెల్లడించింది. 2026 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన జరుగుతుందని తెలిపింది.



విశ్వ వీక్షణం



సంచార్ సాథీపై వెనక్కి తగ్గిన కేంద్రం

- మొబైల్ లో ప్రీ ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి కాదు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 3 : అన్ని మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్ ని తప్పనిసరిగా ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలంటూ మొబైల్ ఫోన్ తయారీ కంపెనీలకు జారీచేసిన ఆదేశాలపై కేంద్రం వెనక్కు తగ్గింది. మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్ ప్రీ ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ఉత్తర్వులపై సెల్ ఫోన్ కంపెనీలతోపాటు నిపుణుల నుంచి వ్యక్తిగత గోప్యతకు సంబంధించి తీవ్ర ఆందోళనలు, ప్రభుత్వ నిఘా ఉంటుందన్న భయాందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. కేంద్రం నిర్ణయాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దేశ పౌరులపై నిఘా పెట్టేందుకే ఈ యాప్ తెస్తోందని ఆరోపించాయి. ఇది ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. విపక్షాల విమర్శల నేపథ్యంలో సంచార్ సాథీ యాప్ ప్రీ ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి కాదని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఇప్పటికే ఈ విషయంలో స్పష్టతనిచ్చారు. సంచార్ సాథీ యాప్ యాక్టివేట్ చేసుకోవడం కేవలం ఐచ్ఛికం మాత్రమేనని, ఇది తప్పనిసరి కాదని ప్రకటించారు. ఈ యాప్‌ని ఎవరైనా తొలగించుకోవచ్చని కూడా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన ఈ సైబర్ సెక్యూరిటీ యాప్ ఎటువంటి నిఘా పెట్టడం కాని కాల్ మానిటరింగ్ కాని చేయబోదని స్పష్టం చేశారు. అంతేకాదు సంచార్ సాథీ సేఫ్టీ యాప్‌తో స్నూపింగ్ జరగదని కూడా స్పష్టం చేశారు.



బాబోయ్.. బొద్దింక

ఇలాంటి వ్యాధులకు కారణం బొద్దింకే....!

బొద్దింకల ఆవాసానికి దాదాపు ప్రతి ఇల్లూ నిలయమే. కార్యాలయాలు, రెస్టారెంట్లు, హోటళ్లు ఇందుకు అతీతం కాదు.. ముఖ్యంగా రాత్రి పూట వంటగదిలో ఎక్కువగా బొద్దింకలు తిరుగుతుంటాయి.. బొద్దింకను చూడగానే ఆమడదూరం పారిపోయే వారూ లేకపోలేదు. బొద్దింకలు ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పును కూడా కలిగిస్తాయి. వాటి ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి ఖచ్చితంగా తెలుసుకోవాలి. పిల్లలు, వృద్ధుల రోగనిరోధక శక్తి బలహీనంగా ఉండటం వల్ల ఈ వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే విషయం.

బొద్దింకలు టైఫాయిడ్, ఫుడ్ పాయిజనింగ్ వంటి వ్యాధులకు కారణమయ్యే బ్యాక్టీరియాను వ్యాప్తి చేస్తాయి. అవి మురికిని వ్యాప్తి చేయడమే కాకుండా, ఆహార పదార్థాలు, వంట పాత్రలు, మరియు వంటగది ఉపరితలాలపై హానికరమైన బ్యాక్టీరియా, వాటి లాలాజలం మరియు విసర్జితాలతో కలుషితం చేస్తాయి. దీంతో అలర్జీలు, ఉబ్బసం వంటి సమస్యలు కూడా వస్తాయి.. బొద్దింకలు హానికరమైన కీటకాలు మాత్రమే కాదు.. గాలి నాణ్యతను కూడా దిగజార్చగలవని నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీ పరిశోధనలో తేలింది. మనుషుల ఆరోగ్యం, ఇంటి లోపల గాలి నాణ్యతను మరింత దిగజార్చే అధికస్థాయి బ్యాక్టీరియల్ ఎండోటాక్సిన్స్, అలెర్జెన్స్ కు, కీటకాలకు మధ్య స్పష్టమైన సంబంధాన్ని పరిశోధకులు కనుగొన్నారు. ఈ అధ్యయనం 'ది జర్నల్ ఆఫ్ అలెర్జీ అండ్ క్లినికల్ ఇమ్యునాలజీ: గ్లోబల్' లో ప్రచురితమైంది. కీటకాల నియంత్రణ పద్ధతులతో బొద్దింకలను పూర్తిగా నిర్మూలించడం ద్వారా ఈ ఎండోటాక్సిన్స్, అలెర్జెన్స్ తగ్గించవచ్చని పరిశోధన తెలిపింది. బొద్దింకలతో బ్యాక్టీరియల్ ఎండోటాక్సిన్స్, అలెర్జెన్స్ దీంతో అనారోగ్యంతోపాటు గాలి నాణ్యతలో క్షీణత ఎండోటాక్సిన్స్కు నిలయంగా మారిన మన వంట గదులు..

ఇన్‌ఫెక్షన్లకు కారణం..

బొద్దింకలు విస్తృత శ్రేణి పదార్థాలను ఆరగిస్తాయి కాబట్టి వైవిధ్యమైన గట్ మైక్రోబయోమ్స్ కలిగి ఉంటాయి. వాటి రెట్టల ద్వారా పెద్ద మొత్తంలో ఎండోటాక్సిన్స్ విడు దల అవుతుంది. గట్ మైక్రోబయోమ్ అనేది జీర్ణ వ్యవస్థలో ట్రిలియన్ల కొద్దీ సూక్ష్మజీవుల సమూహం. వీటిలో బ్యాక్టీరియా, వైరస్లు, శిలీంధ్రాలు ఉంటాయి. బ్యాక్టీరియల్ ఎండోటాక్సిన్స్ గ్రామ్‌నెగెటివ్ బ్యాక్టీరియాలో ఒక భాగం. ఇవి ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. లిపో పాలిసాకరైడ్స్ అని కూడా పిలిచే ఎండోటాక్సిన్లు బ్యాక్టీరియా చనిపోయినప్పుడు విడుదలవుతాయి. జ్వరం, విరోచనాలు వంటి లక్షణాలను కలిగిస్తాయి. అలెర్జెన్స్ (అలెర్జీ కారకాలు) కలిసి బహిర్గతమైనప్పుడు ఉబ్బసం వంటి శ్వాసకోశ సమస్యలు ఎదురవుతాయి. అలెర్జీ కారకం మానవ శరీరంలోకి ప్రవేశించినప్పుడు రోగనిరోధక వ్యవస్థ హిస్టామిన్ వంటి రసాయనాలను విడుదల చేస్తుంది. దీని వలన తుమ్ము, దురద, దద్దుర్లు, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి.నార్త్ కరోలినాలోని రాలీ నగరంలో ఉన్న గృహ సముదాయాల్లో రెండు వర్గాలుగా చేసి పరిశోధనలు చేశారు.. ప్రతి ఇంట్లో బొద్దింకల ఉధృతిని, ఎండోటాక్సిన్స్, అలెర్జీ కారకాలు ఏ స్థాయిలో వ్యాప్తి చెందాయో శాస్త్రవేత్తలు పరిశీలించారు. బొద్దింకలకు ఆవాసంగా ఉన్న అపార్ట్మెంట్స్ రెండు వర్గాలుగా విభజించారు. ఒక వర్గంలోని ఇళ్లలో పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టారు. మూడు, ఆరు నెలల్లో దుమ్ము, కీటకాల నమూనా లను రెండువర్గాల గృహాల నుంచి సేకరించారు. పెస్ట్ కంట్రోల్ చేయని ఇళ్లు అధిక స్థాయిలో అలెర్జీ కారకాలు, ఎండోటాక్సిన్స్ రెండింటినీ చూపించాయి. ఎక్కడైతే బొద్దింకలను పూర్తిగా తొలగించారో ఆ ఇళ్లలో అలెర్జీ కారకాలు, ఎండోటాక్సిన్స్ రెండూ గణనీయంగా తగ్గాయి.



బొద్దింకలతో వచ్చే ఆరోగ్య సమస్యలు

సాల్మొనెలోసిస్ : రోగాల కారకాలుబొద్దింకలు సాల్మొనెల్లా లాంటి బ్యాక్టీరియాను మురుగు కాలువలు, చెత్త డబ్బాలు వంటి అపరిశుభ్ర ప్రదేశాల నుంచి తీసుకొచ్చి మన ఇళ్లలోని ఆహారం మీద, ఉపరితలాల మీద అంటించి పోతాయి. హాస్పిటల్స్, ఫుడ్ ఏరియాల్లో సేకరించిన బొద్దింకల్లో డ్రగ్ రెసిస్టెంట్ సాల్మొనెల్లా వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియా కూడా ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. ఈ బ్యాక్టీరియాతో ఫుడ్ పాయిజన్, విరోచనాలు, జ్వరం వస్తుంది.

టైఫాయిడ్ : కలుషిత ఆహారం, నీటి ద్వారా వ్యాపించే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్.

ఎస్చెరిచియా కోలి ఇన్ఫెక్షన్స్ : దీని వలన కడుపు తిమ్మిర్లు, విరోచనాలు, మూత్రపిండాల సమస్యలు.

గ్యాస్ట్రోఎంటెరిటిస్: కడుపు, పేగుల వాపు. ఫలితంగా వికారం, వాంతులు, తిమ్మిర్లు.

కలరా: తీవ్రమైన విరోచ నాలు, డీహైడ్రేషన్కు కారణ మయ్యే ప్రాణాంతక వ్యాధి.

లిస్టెరియోసిస్: నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్. గర్భిణులు, శిశువులకు ప్రమాదకరం.

ఫుడ్ పాయిజనింగ్..

బొద్దింకల కారణంగా తలెత్తే సమస్యల్లో ప్రధానమైంది ఫుడ్ పాయిజనింగ్. తెలియకుండా బొద్దింకలు ఉన్న ఆహారం లేదా నీటిని తీసుకుంటే, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరం వంటివి వస్తాయి. తేలికపాటి సందర్భాల్లో, ఓఆర్ఎస్ తాగడం, తగినంత నీరు తాగడం ద్వారా ఉపశమనం పొందవచ్చు, కానీ అవసరమైతే యాంటీబయాటిక్స్ కూడా తీసుకోవలసి ఉంటుంది.

డా. కౌశల్ గోవర్ధన
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా. ధనుంజయ
నర్సింగ్ హోమ్
7702417779



వంట గదిలోనే ఎక్కువ..

ఆడ బొద్దింకలు ఎక్కువ తింటాయి కాబట్టి మగవాటి కంటే దాదాపు రెండు రెట్లు అధికంగా ఎండోటాక్సిన్స్ను ఉత్పత్తి చేస్తాయని పరిశోధకులు కనుగొన్నారు. అంతేకాకుండా బెడ్రూమ్స్ కంటే ఎక్కువ ఎండోటాక్సిన్స్ ను వంట గదుల్లో గుర్తించారు. ఎందుకంటే బొద్దింకలకు సమృద్ధిగా ఆహార వనరులను కిచెన్స్ అందిస్తాయి. బొద్దిం కలు ఎండోటాక్సిన్స్, శక్తివంతమైన అలెర్జీ కారకాలకు ముఖ్యమైన మూలం. దీని ఫలితంగా ఉబ్బసం ఉన్న పిల్లలు ఈ రెండింటికీ గురయ్యే అవకాశం ఉందని పరిశోధనలో వెల్లడైంది. యూ ఎస్ ఏ గతంలో చేపట్టిన సర్వేలు బొద్దింకలు ఉన్నట్టు ఆధారాలు ఉన్న ఇళ్లలో ఎండోటాక్సి న్స్ స్థాయిలు చాలా ఎక్కువగా ఉన్నాయని కనుగొన్నారు..

పాటించాల్సిన జాగ్రత్తలు:

1) బొద్దింకల నుంచి వచ్చే రోగాల నుంచి రక్షణ పొందాలంటే వాటిని ఇంటి నుంచి పూర్తిగా దూరం చేయాలి. దీనికి హైజీన్, ఇంటి మెయింటెనెన్స్, పెస్ట్ కంట్రోల్ స్ట్రాటజీస్ అవసరం. ఆహార పదార్థాలు, చెత్త లాంటి వాటికి బొద్దింకలు అట్రాక్ట్ అవుతాయి. అందుకే కిచెన్‌ను ఎప్పటికప్పుడు క్లీన్ చేసి డిస్‌ఇన్‌ఫెక్ట్ చేయాలి.

2) బొద్దింకలకు (Cockroaches) నీరు చాలా అవసరం. అందుకే లీకులను సరిచేయాలి. సింక్‌లు, టబ్‌లలో నీరు నిలువకుండా చూడాలి. డ్యాంప్ కండిషన్స్ తగ్గించడానికి డీహ్యూమిడిఫైయర్‌లు వాడాలి.మీ ఇంట్లో బొద్దింకలు విపరీతంగా పెరిగితే ప్రొఫెషనల్ పెస్ట్ కంట్రోల్ సర్వీస్‌ను ఆశ్రయించడం చాలా అవసరం. వాళ్లు వాటిని ఎఫెక్టివ్‌గా మేనేజ్ చేస్తారు..





ఎంసీడీ ఎన్నికలలో బీజేపీ హవా

- 12 స్థానాలకుగాను 7 స్థానాలు కైవసం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 3: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బీజేపీ హవా నడిచింది. తాజాగా 12 డివిజన్లకు జరిగిన ఉప ఎన్నికలలో 7 స్థానాలను కైవసం చేసుకుంది. మిగతా ఐదు స్థానాలలో మూడింటిని ఆమ్ ఆద్మీ పార్టీ, ఒకటి కాంగ్రెస్ గెలుచుకున్నాయి. మరో స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. నవంబర్ 30న జరిగిన ఎన్నికల ఫలితాలను బుధవారం ప్రకటించారు. అనేక స్థానాలలో ఆసక్తికర పోటీలు జరిగాయి. కొన్ని ప్రాంతాలలో, బీజేపీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, మరికొన్ని చోట్ల, ఆప్ తన ఉనికిని చాటుకుంది. ఇక, కాంగ్రెస్ పార్టీ కూడా కీలక స్థానాన్ని గెలుచుకోవడం ద్వారా అందరినీ ఆశ్చర్యపరిచింది. బీజేపీకి చెందిన రేఖా రాణి దిచౌన్ కలాన్‌లో 5,637 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సంగం విహార్ వార్డు గెలుచుకుని అద్భుతమైన పునరాగమనం చేసింది. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ చౌదరి 12,766 ఓట్లను సాధించగా, బీజేపీకి చెందిన సుభ్రజిత్ గౌతమ్ 9,138 ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారు. చాలా కాలం తర్వాత ఈ విజయం కాంగ్రెస్‌కు మనోధైర్యాన్ని పెంచింది. దక్షిణపూరి వార్డులో ఆమ్ ఆద్మీ పార్టీ తన పట్టును నిలబెట్టుకుంది. ఆప్ అభ్యర్థి రామ్ స్వరూప్ కనోజియా 12,372 ఓట్లతో గెలుపొందగా, బీజేపీకి చెందిన రోహిణి 10,110 ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారు. ఈ విజయం దక్షిణ ఢిల్లీలో ఆప్ పట్ల ప్రజల విశ్వాసానికి చిహ్నంగా భావిస్తున్నారు.

2026లో బంగారం ధర ఎంత ఉంటుంది?!

- గూగులమ్మను ఆశ్రయిస్తున్న వినియోగదారులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, డిసెంబర్ 3 : ప్రస్తుతం భారతీయ ఇన్వెస్టర్లు, సామాన్య ప్రజలు గూగుల్ లో భారీగా సెర్చ్ చేస్తున్నది ఏంటో తెలుసా! వచ్చే యేడాది 2026లో బంగారం ధరలు ఎలా ఉంటాయా అని!! బంగారం ధరల కదలికలపై ప్రజలు ఎంత దృష్టి సారించారో చెప్పడానికి ఈ గూగుల్ ట్రెండ్ ఒక నిదర్శనం. కొనుగోలుదారులు మాత్రమే కాదు, మార్కెట్ నిపుణులు సైతం ఇదే తరహా అంచనాలు వేస్తున్నారు. ఈ అంచనాలకు బలం చేకూర్చేలా గోల్డ్మన్ శాక్స్ నివేదిక కూడా కీలక విషయాలను వెల్లడించింది. సుమారు 900 మంది గ్లోబల్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లతో జరిపిన సర్వేలో, దాదాపు 70 శాతం మంది వచ్చే యేడాది కూడా బంగారం ధరలు మరింత పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.



దీనికి ప్రధాన కారణంగా ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడం, భవిష్యత్తులో వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు ఉన్నాయని వారు విశ్లేషిస్తున్నారు. ఈ యేడాది ఇప్పటికే పసిడి ధర 61 శాతం పెరిగి, తొలిసారిగా 4,000 డాలర్ల మార్కును దాటింది. కేంద్ర బ్యాంకులు తమ నిల్వలను పెంచుకోవడానికి బంగారాన్ని సురక్షిత సాధనంగా భావించడమే ఈ పెరుగుదలకు ముఖ్య కారణమని నివేదిక పేర్కొంది. భారత మార్కెట్లో బంగారం ధరలు సేఫ్ ఇన్వెస్ట్ మెంట్ గా భావించే 24 క్యారెట్ల బంగారాన్ని పెట్టుబడుల కోసం ఎక్కువగా వినియోగిస్తారు. ఇక 22, 18 క్యారెట్ల బంగారాన్ని ప్రధానంగా ఆభరణాల తయారీలో ఉపయోగిస్తారు.

'ప్రధాని మోడీ చాయ్ వాలా' వీడియో కలకలం

- తీవ్రంగా మండిపడిన బీజేపీ నాయకులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 3: పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ ఢిల్లీలో కలకలం చెలరేగింది. ప్రధాని మోడీని ఉద్దేశించి కాంగ్రెస్ పెట్టిన ఓ వీడియో రాజకీయ దుమారం రేపింది. 'ప్రధాని మోడీ చాయ్ వాలా' అంటూ కాంగ్రెస్ నాయకురాలు రాగిణి నాయక్ ఏఐ జనరేటెడ్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. మరి, 'ఇది ఎవరు క్రియేట్ చేశారంటూ' ప్రశ్నించారు. నీలం రంగు కోటు, నలుపు ప్యాంట్ ధరించిన మోడీ ఓ చేతిలో టీ కెటిల్, మరో చేతిలో టీ కప్స్ పట్టుకుని చాయ్ రెడ్ కార్పెట్‌పై అమ్ముతున్నట్లుగా వీడియోలో కనిపిస్తోంది. దీని మీద బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది ప్రధాని వ్యక్తిత్వాన్ని అవమానించే ప్రయత్నమని మండిపడింది. కాంగ్రెస్ పార్టీకి ఇది సరైన పద్ధతి కాదని విమర్శించింది. బీజేపీ నాయకుడు షెహజాద్ పూనావాల్లా మాట్లాడుతూ, వెనుకబడినవర్గాల నుంచి వచ్చిన కామ్‌దార్ ప్రధానిని కాంగ్రెస్ ఎప్పుడూ సహించలేకపోతోందని అన్నారు. మోడీ పేద కుటుంబంలో జన్మించారని, ఓబీసీ వర్గానికి చెందినవారని అన్నారు. దీంతో ఆయన 'చాయ్‌వాలా' నేపథ్యాన్ని కాంగ్రెస్ పదేపదే ఎగతాళి చేస్తోందని విమర్శించారు. గతంలో కూడా కాంగ్రెస్ నాయకులు మోడీని, ఆయన తల్లిని అవమానించిన ఉదాహరణలను గుర్తుచేశారు.





ఆ ఇద్దరి ఎంట్రీతో రింకూ, నితీష్‌కు నిరాశే

- టీ 20 సిరీస్‌కు భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ

స్వదేశంలో ఈనెల 9 నుంచి దక్షిణాఫ్రికాతో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు గాను వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్థిక్ పాండ్యా రీఎంట్రీ ఇచ్చారు. ఈ మేరకు సీనియర్ మెన్స్ సెలక్షన్ కమిటీ.. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని 15 మందితో కూడిన జట్టును బుధవారం ప్రకటించింది. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు సందర్భంగా మెడనొప్పితో రెండో టెస్టుతో పాటు వన్డేలకూ దూరమైన గిల్.. సిరీస్‌కు ఎంపికైనా అతడు ఆడేందుకు సీవోఈ నుంచి పూర్తిస్థాయి క్లియరెన్స్ లభిస్తేనే ఆడే అవకాశముంటుందని బీసీసీఐ ప్రకటనలో తెలిపింది. ఇక ఆసియా కప్ ఫైనల్‌లో గాయపడి రెండునెలల పాటు ఆటకు దూరంగా ఉన్న హార్థిక్ సైతం ఇటీవలే పూర్తిస్థాయిలో కోలుకుని సయ్యిద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో తన ఫిట్‌నెస్‌ను చాటుకున్నాడు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడిన జట్టులో రెండు మార్పులతో జట్టును ప్రకటించారు. ఆ సిరీస్‌లో సభ్యులుగా ఉన్న ఫినిషర్ రింకూ సింగ్‌తో పాటు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి జట్టులో చోటు దక్కలేదు. డిసెంబర్ 9న కటక్ వేదికగా మొదలుకాబోయే టీ20 సిరీస్.. 19న ముగియనుంది.

భారత జట్టు : సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్థిక్ పాండ్యా, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, సంజూ శాంసన్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్,కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.



విరాట్, రుతురాజ్ సెంచరీలు వృథా

రెండో వన్డేలో భారత్ ఓటమి

రాయ్‌పూర్ లో జరిగిన రెండు వన్డేలో భారత్‌పై సౌతాఫ్రికా నాలుగు వికెట్ల విజయం సాధించింది. టీమిండియా విధించిన 359 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఐడెన్ మార్క్‌రమ్ సెంచరీ.. మాథ్యూ బ్రీట్జ్కే, డెవాల్డ్ బ్రెవిస్ హాఫ్ సెంచరీలతో సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 362 పరుగులు చేసింది. టీమిండియా బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ సెంచరీలు వృథా అయ్యాయి. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా కెప్టెన్ కేఎల్ రాహుల్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్ తక్కువ స్కోర్‌కే వెనుదిరిగినా.. విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ సెంచరీలు చేయడంతో టీమిండియా భారీ స్కోర్ చేయగలిగింది. రుతురాజ్ కేవలం 77 బంతుల్లోనే సెంచరీ చేశాడు. కెరీర్‌లో గైక్వాడ్‌కు వన్డేల్లో రెండో సెంచరీ. 82 బంతుల్లో 12 ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 105 పరుగులు చేసి గైక్వాడ్ పెవిలియన్‌కు చేరాడు. మరో ఎండ్‌లో విరాట్ కోహ్లీతో సెంచరీ చేశాడు. 93 బంతుల్లో ఏడు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 102 పరుగులు చేశాడు. చివరలో కెప్టెన్ కేఎల్ రాహుల్ హాఫ్ సెంచరీతో అలరించారు. ఆకట్టుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా (24) సహకారం అందించాడు. దాంతో నిర్ణీత 50 ఓవర్లలో టీమిండియా ఐదు వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీ స్కోర్ చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్‌కు రెండు, బర్గర్, ఎన్గిడికి చెరో వికెట్ దక్కింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా ఆరంభంలో షాక్ తగిలింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (8) తక్కువ స్కోర్‌కే అవుట్ అయ్యాడు. మరో ఓపెన్ ఐడెన్ మార్క్‌రమ్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. కెప్టెన్ టెంబా బావుమాతో కలిసి స్కోర్ బోర్డును పరుగులెత్తించాడు. 98 బంతుల్లో సిక్సర్లు, 10 ఫోర్ల సహాయంతో 110 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. టెంబా బావుమా 48 బంతుల్లో మూడు ఫోర్లు, సిక్సర్ సహాయంతో 46 పరుగులు చేశాడు. మాథ్యూ బ్రీట్జ్కే (68), డేవాల్ట్ బ్రేవిస్ అర్థ సెంచరీలతో రాణించారు. ముఖ్యంగా బ్రేవిస్ బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. 34 బంతుల్లోనే ఐదు భారీ సిక్సర్లు, ఒక ఫోర్ సహాయంతో 54 పరుగులు చేశాడు. టోనీ డి జోర్జి (17) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగినా.. కార్బిన్ బాష్ (29), కేశవ్ మహరాజ్ (10) జట్టును గెలిపించారు.



ఆ వార్తలు నిజం కావు

ప్రొడ్యూసర్ దిల్ రాజు

"శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నుండి రాబోయే సినిమాల గురించి ఈ మధ్య రకరకాల పుకార్లు వినిపిస్తున్నాయి. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవని, వాటిలో నిజం లేదని మేము తెలియజేస్తున్నాము" అన్నారు నిర్మాత దిల్ రాజు."ఎప్పుడో వచ్చిన పాత ఊహాగానాలకు, ఇప్పటి విషయాలకు కొంత మంది ఇప్పుడు ముడిపెట్టి తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం మేము అక్షయ్ కుమార్ హీరోగా, అనీస్ బాజ్మీ దర్శకత్వంలో ఒక సినిమాను ప్లాన్ చేస్తున్నాము. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మేమే అధికారికంగా ప్రకటిస్తాము. దయచేసి అప్పటి వరకు మా నుండి అధికారిక సమాచారం వచ్చేదాకా ఎలాంటి నిర్ధారణలకు రావొద్దని, ధృవీకరించని వార్తలను మీ గౌరవ మీడియా లో ప్రచారం చేయవద్దని మీడియా మిత్రులను కోరుతున్నాము" అని దిల్ రాజు తెలిపారు.



అర్జున.. నిజమేనా?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఇక ఈ సినిమా షూటింగ్‌ను వీలైనంత త్వరగా ముగించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే, పవన్ కళ్యాణ్ కోసం ఓ ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను టాప్ ప్రొడ్యూసర్ రిజిస్టర్ చేయించినట్లు సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు గతంలో పవన్‌తో 'వకీల్ సాబ్' చిత్రాన్ని రూపొందించారు. ఇక ఇప్పుడు ఆయనతో మరో సినిమా చేసేందుకు ఈ నిర్మాత ప్రయత్నిస్తున్నారట. దీనికోసం 'అర్జున' అనే ఓ పవర్‌ఫుల్ టైటిల్‌ను ఆయన రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. కాగా, ఈ సినిమాను ఎవరితో డైరెక్ట్ చేయిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. మరి నిజంగానే పవన్ కళ్యాణ్ ఈ సినిమాకు ఓకే చెబుతాడా అనేది వేచి చూడాలి.



ఆ తప్పుల వల్లే ఓటమి

ఫీల్డింగ్ తప్పిదాలతో పాటు పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు అదనపు పరుగులు చేయకపోవడం తమ ఓటమిని శాసించిందని టీమిండియా కెప్టెన్ కేఎల్ రాహుల్ తెలిపాడు. విపరీతమైన డ్యూ కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయడం చాలా కష్టమైందని అభిప్రాయపడ్డాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో సమష్టిగా రాణించిన సౌతాఫ్రికా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన కేఎల్ రాహుల్.. తమ ఓటమికి గల కారణాలను వెల్లడించాడు. బ్యాటింగ్‌లో మరో 2025 పరుగుల అదనంగా చేయాల్సిందని, ఫీల్డింగ్ వైఫల్యం కూడా విజయవకాశాలను దెబ్బతీసిందన్నాడు. లోయరార్డర్ బ్యాటర్లు ఇంకాస్త మెరుగ్గా ఆడాల్సిందని అభిప్రాయపడ్డాడు. 'ఈ మ్యాచ్‌లో విపరీతమైన మంచు ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయడం చాలా కష్టంగా మారింది. మా బాధను చూడలేక అంపైర్లు బంతిని మార్చారు. టాస్ కీలక పాత్ర పోషించింది. టాస్ ఓడినందుకు ఈ ఓటమికి నేనే బాధ్యత తీసుకోవాలి. అయితే ఈ మ్యాచ్‌లో మేం ఇంకాస్త మెరుగైన ప్రదర్శన చేయాల్సింది. 350 పరుగులు మంచి స్కోర్. కానీ డ్యూ ఫ్యాక్టర్ నేపథ్యంలో మరో 2025 పరుగులు అదనంగా చేయాల్సింది. ఫీల్డింగ్‌లో కూడా తప్పిదాలు చేశాం. కొన్ని పరుగులను ఆపలేకపోయాం. రుతురాజ్ గైక్వాడ్, విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చేయడం చూడటం చాలా బాగుంది. అతను తన పని గురించి మాట్లాడుతూనే ఉంటాడు. స్పిన్నర్లను రుతురాజ్ ఎదుర్కొన్న విధానం అద్భుతం. అతను వేగంగా ఆడటంతోనే మాకు 20 పరుగులు అదనంగా లభించాయి. లోయరార్డర్ మరింత మెరుగ్గా బ్యాటింగ్ చేయాల్సింది. కండిషన్స్ నేపథ్యంలోనే నేను ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాను. విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ మంచి టెంపోను సెట్ చేశారు. వారి బాటలో నేను నడిచాను. గత మ్యాచ్‌లో 50 పరుగులు చేయడంతో నా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయడమే ఉత్తమమనిపించింది.' అని కేఎల్ రాహుల్ చెప్పుకొచ్చాడు.



మన శంకర వరప్రసాద్ గారు!


మరో అప్‌డేట్‌కు రెడీ!!

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' పూర్తి ఫ్యామిలీ డ్రామాగా రానుంది. ఈ సినిమాలో స్టార్ బ్యూటీ నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇక ఈ సినిమా నుండి మేకర్స్ ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. ఈ సినిమా నుండి ఓ బ్యూటీఫుల్ అప్డేట్‌ను డిసెంబర్ 4న ఉదయం 11.08 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే, ఈ అప్డేట్ ఏమై ఉంటుందా అనే ఆసక్తి సినీ సర్కిల్స్‌తో పాటు ప్రేక్షకుల్లో నెలకొంది. కాగా, ఇది ఈ సినిమాలోని రెండో సింగిల్ సాంగ్‌కు సంబంధించిన అప్డేట్ అయ్యి ఉంటుందని పలువురు కామెంట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో కేథరిన్ ట్రెసా మరో కీలక పాత్ర పోషిస్తోంది. సినిమా షూటింగ్ దాదాపు పూర్తి అవగా, త్వరలో పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ప్రారంభం కానున్నాయి. షైన్ స్క్రీన్స్ మరియు గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తున్నారు.



మరో తెలుగు సినిమా?

ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. మాలీవుడ్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఈ మూవీకి సంబంధించిన ఈవెంట్ భారీ ఎత్తున జరిగింది. దీంతో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణే పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్.సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది.





నాని... నాన్ స్టాప్

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ది ప్యారడైజ్' ఇప్పటికే షూటింగ్ మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. కొంతమేర షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం అనుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకు సాగడం లేదు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డీటెయిల్డ్ వర్క్ వల్ల ఆలస్యం అవుతుంది. సెట్స్ నిర్మాణం సహా పలు కారణాల వల్ల ఈ చిత్ర షూటింగ్‌కు బ్రేక్ పడింది. అయితే ఇప్పుడు చిన్న విరామం తరువాత, ఈ చిత్రం షూటింగ్‌కు రెడీ అయింది. డిసెంబర్ 4 నుంచి మళ్లీ ఈ చిత్ర షూటింగ్ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు వృథా అయిన సమయాన్ని పూడ్చుకునేందుకు నాని, శ్రీకాంత్ ఇద్దరూ నాన్‌స్టాప్‌గా షూట్ చేయాలని నిర్ణయించుకున్నారు. నాని డిసెంబర్ మొత్తం హైదరాబాద్‌లోనే ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటాడు. మార్చి కల్లా ఈ సినిమాను పూర్తి చేయాలని నాని ప్లాన్ చేస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200